www.udyamakeratam.com

PRGI No. : TGTEL/25/A0273

ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షిత: UDYAMA KERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | సంపుటి: 2 | సంచిక: 152 | 27-11-2026 | శుక్రవారం | పేజీలు: 8 | వెల : రూ.2/-

వ్యాపారులకు కేంద్రం ఊరట



వ్యాపారులకు, పన్ను చెల్లింపుదారులకు కేంద్ర ప్రభుత్వం ఒక గొప్ప శుభవార్త అందించింది. ఇకపై జీఎస్టీ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసుకోవడానికి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. 4

విద్యుత్ శాఖకు ఏసీబీ షాక్!

- రూ.60 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఏడీఈ ఉద్యోగి 2



కారుకు 38 శాతం.. హస్తానికి 34 శాతం!

- తెలంగాణలో బీఆర్ఎస్‌కు 62, కాంగ్రెస్‌కు 42 స్థానాలు
- ప్రభుత్వానికి రాబోయే రెండేళ్లు కీలకం
- ఓమార్గ్ తాజా సర్వే ఫలితాలు వెల్లడి



2

త్వరలో 25వేల ఉద్యోగాలు!



- లక్ష ఉద్యోగాల భర్తీ లక్ష్యంగా ప్రజాప్రభుత్వం
- ఇప్పటికే 75 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం
- కోటి మంది మహిళలకు కోటి ఇందిరమ్మ చీరలు
- కొత్తగా 4.89 లక్షల పింఛన్ల పంపిణీకి శ్రీకారం
- పాలమూరు పాలాలను కృష్ణా జలాలతో తడుపుతాం
- అచ్చంపేటలో రూ.450 కోట్ల పనులకు శంకుస్థాపన
- అచ్చంపేట బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి

అచ్చంపేట, నవంబర్ 26 (ఉద్యమ కెరటం): రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు సీఎం రేవంత్ రెడ్డి శుభవార్త చెప్పారు. రానున్న ఏడాది కాలంలో మరో 25 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని ప్రకటించారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను గుర్తించి నియామకాలపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటికే 75 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని, మరో ఏడాదిలో లక్ష ఉద్యోగాల భర్తీ లక్ష్యాన్ని పూర్తి చేస్తామని వెల్లడించారు. ప్రజాపాలన ప్రగతి బాట కార్యక్రమంలో భాగంగా గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు. అంతకుముందు అంబేద్కర్ చౌరస్తా నుంచి మంత్రులు, ప్రజాప్రతినిధులు, స్థానికులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలకు కోటి ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని సీఎం లాంఛనంగా ప్రారంభించారు.

మిగతా 2 లో



పార్లమెంట్‌లో కీలక ఘట్టానికి తెర!

- ఈ నెల 30న లోక్‌సభ.. డిసెంబర్ 2న రాజ్యసభ సమావేశాలు
- డిసెంబర్ 3 వరకు సభా కార్యకలాపాలు
- మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజనపై ఉత్కంఠ
- లోక్‌సభ స్థానాలను 850 వరకు పెంచే ప్రతిపాదన?
- ప్రాతినిధ్యం తగ్గుతుందనే ఆందోళనలో దక్షిణాది రాష్ట్రాలు
- పార్లమెంట్ సమావేశాలపై కాంగ్రెస్ వ్యూహరచన



మొబైల్ ఫోన్లు, మైకులు పట్టుకున్న వారు జర్నలిస్టులు కాదు

జర్నలిస్టులు, రీల్ క్రియేటర్ల మధ్య తేడాపై సుప్రీం విచారణ 4

రాజ్యాంగ పరిరక్షణకు ప్రజలంతా పోరాడాలి

- బీజేపీ కుట్రలను తిప్పికొట్టాలి
- రాజ్యాంగాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత
- సీఎం రేవంత్‌రెడ్డి
- మోడీ సర్కారుపై తీవ్ర విమర్శలు
- తెలంగాణలో కాంగ్రెస్‌కు 90 అసెంబ్లీ సీట్లే లక్ష్యం

2





సైబరాబాద్ సీపీ, డీసీపీకి జైలు శిక్ష!

ఇద్దరు పోలీసు ఉన్నతాధికారులకు రెండు వారాల జైలు 2

మహిళల హక్కులకు రాజ్యాంగమే రక్షణ

- మహిళలకు సమాన హక్కులిచ్చింది రాజ్యాంగమే
- హక్కుల అమలులో కొనసాగుతున్న వివక్ష
- మహిళల చరిత్రను వారే రాసుకోవాలి
- తెలంగాణ రుద్రమ సేనగా మహిళా విభాగం పేరు మార్పు
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

2





బండి భగీరథ్‌కు కోర్టు సమన్లు

- జనవరి 28న హాజరుకావాలని ఆదేశం
- మైనర్ బాలిక తల్లి ఫిర్యాదుతో కేసు
- మే 16న అరెస్టు చేసిన పోలీసులు
- జూలైలో రెగ్యులర్ బెయిల్ మంజూరు

2

అక్రమంగా అబార్షన్ కిట్ల విక్రయం

138 మెడికల్ షాపులకు నోటీసులు ■ రాష్ట్రవ్యాప్తంగా టీజీ సేఫ్ తనిఖీలు 2

కాంగ్రెస్ ద్వంద్వ వైఖరిని ప్రజలు ప్రశ్నించాలి

- ఈవీఎంలపై గెలుపోటములకో తీరు
- రేవంత్, రాహుల్ వ్యాఖ్యల్లో వైరుధ్యం
- రాజ్యాంగ రూపకల్పనలో తెలుగు ప్రముఖులు
- కేంద్ర మాజీ మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్

2



ఎన్నికల్లో గెలిచినప్పుడు ఈవీఎంలు, ఎన్నికల సంఘం పనితీరును ప్రశంసిస్తూ.. ఓటమి ఎదురైనప్పుడు వాటిపైనే ఆరోపణలు చేయడం కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని కేంద్ర మాజీ మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ విమర్శించారు. దేశ ఆర్థిక వ్యవస్థపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విదేశాల్లో విమర్శలు చేస్తుంటే, 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెబుతున్నారని వ్యాఖ్యానించారు.



పాఠశాలలో సైన్స్ ఫేర్ నిర్వహించలేరా?

- ప్రైవేట్ విద్యాసంస్థలో ప్రదర్శనపై అభ్యంతరం
- గతంలో జాతీయ స్థాయి అవార్డులు సాధించాం
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు

3

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక



సైబరాబాద్ సీపీ, డీసీపీకి జైలు శిక్ష!

ఇద్దరు పోలీసు ఉన్నతాధికారులకు రెండు వారాల జైలు

ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున జరిమానా

హైదరాబాద్, నవంబర్ 26 (ఉద్యమ కెరటం): కోర్టు ధిక్కరణ కేసులో ఇద్దరు పోలీసు ఉన్నతాధికారులకు తెలంగాణ హైకోర్టు జైలు శిక్ష విధించింది. న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించినందుకు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ రెడ్డి, మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డికి రెండు వారాల సాధారణ జైలు శిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున జరిమానా విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మరో వారం రోజులపాటు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఓ భూ వివాదానికి సంబంధించి పిటిషనర్‌కు పోలీసు రక్షణ కల్పించాలని గతంలో హైకోర్టు ఆదేశించింది. అయితే న్యాయస్థానం ఉత్తర్వులను సంబంధిత పోలీసు అధికారులు అమలు చేయలేదంటూ పిటిషనర్ మరోసారి కోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన హైకోర్టు పోలీసు ఉన్నతాధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉత్తర్వుల అమలులో నిర్లక్ష్యాన్ని కోర్టు ధిక్కరణగా పరిగణిస్తూ ఇద్దరు అధికారులకు జైలు శిక్ష విధించింది. అయితే తీర్పును సవాల్ చేస్తూ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు వీలుగా శిక్ష అమలును వారం రోజులపాటు నిలిపివేసింది. ఈ గడువులోగా హైకోర్టు నుంచి శిక్ష అమలు నిలుపుదల ఉత్తర్వులు పొందాలని, లేనిపక్షంలో గడువు ముగిసిన వెంటనే హైకోర్టు రిజిస్ట్రార్ ఎదుట లొంగిపోయి శిక్ష అనుభవించాలని ఆదేశించింది. గతంలోనూ న్యాయస్థానం ఉత్తర్వులను అమలు చేయని పలువురు కలెక్టర్లు, ప్రభుత్వ ఉన్నతాధికారులకు కోర్టు ధిక్కరణ కింద హైకోర్టు జైలు శిక్షలు విధించిన సందర్భాలున్నాయి. తాజాగా ఇద్దరు పోలీసు ఉన్నతాధికారులకు జైలు శిక్ష విధించడం పోలీసు, అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

బండి భగీరథ్‌కు కోర్టు సమన్లు

మేడ్చల్, నవంబర్ 26 (ఉద్యమ కెరటం): పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌కు మేడ్చల్ జిల్లా ప్రత్యేక పోక్సో న్యాయస్థానం సమన్లు జారీ చేసింది. కేసు విచారణలో భాగంగా వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకావాలని ఆదేశించింది. వచ్చే ఏడాది జనవరి 28న న్యాయస్థానం ఎదుట హాజరుకావాలని స్పష్టం చేసింది. దీంతో కేసు విచారణ తదుపరి దశకు చేరుకుంది. 17 ఏళ్ల బాలికను వేధించడంతో పాటు బలవంతంగా మద్యం తాగించి, శారీరకంగా ఇబ్బందులకు గురిచేశారంటూ బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో ఈ ఏడాది మే నెలలో పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో పోలీసులు మే 16న బండి సాయి భగీరథ్‌ను అరెస్టు చేశారు. ఆయనపై పోక్సో చట్టంతో పాటు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), ఆధారాల ధ్వంసానికి సంబంధించిన ఇతర సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ కేసులో భగీరథ్ 50 రోజులకు పైగా జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. అనంతరం జూలైలో న్యాయస్థానం ఆయనకు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది. ప్రస్తుతం మేడ్చల్ ప్రత్యేక పోక్సో కోర్టులో విచారణ కొనసాగుతోంది. తదుపరి న్యాయ ప్రక్రియలో భాగంగా జనవరి 28న ఆయన వ్యక్తిగతంగా హాజరుకావాల్సి ఉంది.

అక్రమంగా అబార్షన్ కిట్ల విక్రయం

138 మెడికల్ షాపులకు నోటీసులు

రాష్ట్రవ్యాప్తంగా టీజీ సేఫ్ తనిఖీలు

హైదరాబాద్, నవంబర్ 26 (ఉద్యమ కెరటం): వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా గర్భస్రావ మాత్రలు విక్రయిస్తున్న మెడికల్ షాపులపై కఠిన చర్యలు తీసుకుంటామని టీజీ సేఫ్ కమిషనర్ అవినాష్ మొహంతి హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా నిబంధనలకు విరుద్ధంగా అబార్షన్ కిట్లు విక్రయిస్తున్న ఫార్మసీలపై డ్రగ్స్ వింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం పోలీసులు సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. 'స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్'లో భాగంగా గురువారం పలు జిల్లాల్లో మెడికల్ షాపుల లావాదేవీల వివరాలను పరిశీలించి ఆకస్మిక సోదాలు చేపట్టారు. ఈ తనిఖీల్లో 138 దుకాణాల్లో తీవ్రమైన నిబంధనల ఉల్లంఘనలు గుర్తించి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. డ్రగ్స్ రూల్స్ ప్రకారం షెడ్యూల్ హెచ్ పరిధిలోకి వచ్చే మిఫెప్రిస్టోన్, మిసోప్రోస్టోల్ మాత్రలను రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్ ఇచ్చిన చెల్లుబాటయ్యే ప్రిస్క్రిప్షన్ ఆధారంగానే విక్రయించాలి. అయితే పలు దుకాణాల్లో వైద్యుల చీటీ లేకుండానే ఓవర్ ది కౌంటర్ పద్ధతిలో ఈ మాత్రలను అమ్ముతున్నట్లు అధికారులు గుర్తించారు. కొనుగోలుదారులకు విక్రయ బిల్లులు ఇవ్వకపోవడం, అమ్మకాల రికార్డులు, ప్రిస్క్రిప్షన్ డ్రగ్ రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించకపోవడం వంటి లోపాలు బయటపడ్డాయి. కొన్ని చోట్ల రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్ అందుబాటులో లేకుండానే మందులు విక్రయిస్తున్నట్లు తనిఖీ బృందాలు గుర్తించాయి. నిబంధనలు ఉల్లంఘించిన 138 మెడికల్ షాపులపై డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం-1940, సంబంధిత నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఆయా దుకాణాల డ్రగ్ లైసెన్సులను తాత్కాలికంగా నిలిపివేయడం లేదా శాశ్వతంగా రద్దు చేయడంపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. అబార్షన్ కిట్ల అక్రమ సరఫరా, ఇతర మార్గాలకు మళ్లింపును అడ్డుకోవడమే ఈ ప్రత్యేక తనిఖీల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఎంటీపీ చట్టం-2002, నిబంధనలు-2003 ప్రకారం అల్ట్రాసౌండ్ పరీక్షలు, వైద్యపరమైన పరిశీలన అనంతరం ప్రభుత్వ గుర్తింపు పొందిన వైద్య కేంద్రంలో నిపుణులైన గైనకాలజిస్టు పర్యవేక్షణలోనే అబార్షన్ మాత్రలు వాడాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా గర్భం గర్భాశయంలో కాకుండా ఫెలోపియన్ ట్యూబ్‌లో ఏర్పడే ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ సందర్భంలో ఈ మాత్రలు పనిచేయవని వివరించారు. ఇలాంటి పరిస్థితుల్లో ట్యూబ్ పగిలి తీవ్ర అంతర్గత రక్తస్రావం జరిగే ప్రమాదం ఉందని, హైపోవోలెమిక్ షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడవచ్చని హెచ్చరించారు. అబార్షన్ కిట్ల అక్రమ విక్రయాలు, పంపిణీకి సంబంధించిన సమాచారం తెలిస్తే కార్యాలయ వేళల్లో 1800-599-6969 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని ప్రజలకు అధికారులు విజ్ఞప్తి చేశారు.

త్వరలో 25వేల ఉద్యోగాలు!



మొదటి పేజీ తరువాయి

దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, నేత, గీత కార్మికులకు కొత్తగా 4.89 లక్షల పింఛన్ల పంపిణీకి శ్రీకారం చుట్టారు. అచ్చంపేట నియోజకవర్గంలో దాదాపు రూ.450 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. "నేను ఈ గడ్డపై పుట్టిన బిడ్డను. నల్లమల, అచ్చంపేట నా సొంత ప్రాంతం. ఈ ప్రాంత అభివృద్ధికి సర్వశక్తులూ ఒడ్డి మీ బిడ్డగా రుణం తీర్చుకుంటా" అని సీఎం పేర్కొన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలే తెలంగాణ ఉద్యమ ప్రధాన ఆకాంక్షలని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో పాలమూరు నీటిపారుదల రంగానికి అన్యాయం జరిగిందని, ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా అచ్చంపేట ఎత్తిపోతల, డిండి, ఎస్ఎల్‌బీసీ, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, జూరాల, పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టులను గత ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందని విమర్శించారు. అప్పట్లో రూ.10 వేల కోట్లు ఖర్చు చేసి ఉంటే ఈ ప్రాజెక్టులు పూర్తయ్యేవని అన్నారు. రోజుకు మూడు టీఎంసీల కృష్ణా జలాలను వినియోగించుకునే అవకాశం ఉంటే లక్షలాది ఎకరాలు సాగులోకి వచ్చేవన్నారు. పాలమూరు జిల్లా బిడ్డగా ఈ ప్రాంత పొలాలను కృష్ణా జలాలతో తడపాల్సిన బాధ్యత తనపై ఉందని స్పష్టం చేశారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఎస్సీ ఉపకులాల వర్గీకరణ ఆకాంక్షను తమ ప్రభుత్వం నెరవేర్చిందని సీఎం తెలిపారు. సమగ్ర కులగణన చేపట్టి ఆయా వర్గాల జనాభా, జీవన ప్రమాణాలకు సంబంధించిన గణాంకాలను సేకరించడం ద్వారా దేశానికి ఆదర్శంగా నిలిచామన్నారు. రైతులు, మహిళలు, యువత సంక్షేమమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇండ్లు, కుటుంబ బీమా, ఇందిరమ్మ చీరలు, ఉచిత విద్యుత్, రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, రైతు రుణమాఫీ వంటి కార్యక్రమాలను చేపట్టామని వివరించారు. నిరుపేదలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళా సంఘాలకు రూ.79 వేల కోట్ల మేర రుణ అనుసంధానం, 75 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ తమ ప్రభుత్వ విజయాలని పేర్కొన్నారు. గత పదేళ్ల పాలనకు, ప్రస్తుత మూడేళ్ల పాలనకు మధ్య తేడాను ప్రజలు బేరీజు వేసుకోవాలని కోరారు. అప్పులతో సతమతమవుతున్న తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపించేందుకు గడిచిన 34 నెలలుగా నిరంతరం శ్రమిస్తున్నామని చెప్పారు. సంక్షేమ పథకాల అమలులో పార్టీ, కులం ఆధారంగా ఎలాంటి వివక్ష చూపడం లేదని స్పష్టం చేశారు. "పేదవారే మా బంధువులు.. పేదలను ఆదుకోవడమే మా లక్ష్యం. ఇందిరమ్మ వారసత్వంలో నిరుపేదలను గుండెల్లో పెట్టుకుని చూసుకోవాల్సిన బాధ్యత మాపై ఉంది" అని సీఎం అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహా, జూపల్లి కృష్ణారావు, ధనసరి అనసూయ సీతక్క, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తోపాటు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు ప్రజలంతా పోరాడాలి: సీఎం రేవంత్‌రెడ్డి

- బీజేపీ కుట్రలను తిప్పికొట్టాలి
- రాజ్యాంగాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత
- మోడీ సర్కారుపై తీవ్ర విమర్శలు
- తెలంగాణలో కాంగ్రెస్‌కు 90 అసెంబ్లీ సీట్లే లక్ష్యం



హైదరాబాద్, నవంబర్ 26 (ఉద్యమ కెరటం): భారత రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రజలంతా ఐక్యంగా నిలబడి ఆ కుట్రలను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని స్పష్టం చేశారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సంవిధాన్ రక్షా మార్చ్'లో ఆయన పాల్గొన్నారు. ట్యాంక్‌బండ్‌పై ఉన్న అంబేద్కర్ విగ్రహం నుంచి నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వరకు ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నుంచి రాజ్యాంగాన్ని రక్షించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. తాము పాలకులం కాదని, ప్రజలకు సేవకులమన్నారు. నియంతృత్వ పాలన కావాలా.. ప్రజల హక్కుల కోసం నిలబడే నాయకత్వం కావాలా అన్నది ప్రజలే తేల్చుకోవాలన్నారు. అధికారం రాజుల చేతుల్లో కాకుండా ప్రజల చేతుల్లో ఉండాలన్నదే రాజ్యాంగ నిర్మాతల ఆకాంక్ష అని సీఎం పేర్కొన్నారు. పేదల బ్యాంకు ఖాతాల్లో రూ.15 లక్షలు జమ చేస్తామని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి మోడీ అధికారంలోకి వచ్చారని విమర్శించారు. మూడోసారి అధికారాన్ని దక్కించుకునేందుకు భాష, ప్రాంతాల మధ్య విభేదాలను రెచ్చగొట్టారని ఆరోపించారు. ఎన్నికల్లో ఈడీ, సీబీఐ, ఐటీ వంటి దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకున్నారని విమర్శించారు. నాలుగోసారి కూడా అధికారంలోకి రావాలనే లక్ష్యంతో ఇప్పుడు రాజ్యాంగ వ్యవస్థలపై దాడికి దిగుతున్నారని ఆరోపించారు. పేదలు, దళితులు, గిరిజనుల ఓటు హక్కును దెబ్బతీసేలా ఓట్ల తొలగింపునకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఇప్పటికే 13 కోట్ల ఓట్లను తొలగించారని, మరో ఏడు కోట్ల ఓట్లను తొలగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవారి ఓటు హక్కును కాలరాసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. గతంలో బ్రిటిష్ పాలకులు సైమన్ కమిషన్‌ను తీసుకొచ్చిన తరహాలోనే ఇప్పుడు బీజేపీ జ్ఞానేశ్వర్ కమిషన్‌ను తీసుకొచ్చిందని ముఖ్యమంత్రి విమర్శించారు. నాడు భగత్‌సింగ్ బ్రిటిష్ పాలకులపై పోరాటం సాగిస్తే.. నేడు రాహుల్ గాంధీ రాజ్యాంగ పరిరక్షణ కోసం నాయకత్వం వహిస్తున్నారని అన్నారు. దేశంలో గాంధీ వారసులకు, గాడ్సే వారసులకు మధ్య పోరాటం సాగుతోందని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే తదితరులు పాండవుల పక్షాన నిలిస్తే.. ప్రధాని మోడీ, అమిత్ షా కౌరవుల తరహాలో వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యానించారు. గాడ్సే వారసులను ఓడించాలంటే రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి కోటి ఓట్లు సాధించడంతో పాటు 90 అసెంబ్లీ స్థానాలు, 15 పార్లమెంట్ స్థానాల్లో విజయం సాధించేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.

కారుకు 38 శాతం.. హస్తానికి 34 శాతం!

- తెలంగాణలో బీఆర్ఎస్‌కు 62, కాంగ్రెస్‌కు 42 స్థానాలు
- ప్రభుత్వానికి రాబోయే రెండేళ్లు కీలకం
- ఓమార్ట్ తాజా సర్వే ఫలితాలు వెల్లడి

ఖైరతాబాద్, నవంబర్ 26 (ఉద్యమ కెరటం) : తెలంగాణలో రాజకీయ పార్టీల బలాబలాలు, ప్రభుత్వ పనితీరు, ప్రజాభిప్రాయంపై నిర్వహించిన తాజా సర్వేలో బీఆర్ఎస్ పార్టీ ముందంజలో ఉన్నట్లు వెల్లడైంది. సర్వే ప్రకారం బీఆర్ఎస్‌కు 38 శాతం ఓటింగ్‌తో 62 అసెంబ్లీ స్థానాలు, కాంగ్రెస్‌కు 34 శాతం ఓటింగ్‌తో 42 స్థానాలు వొచ్చే అవకాశాలున్నాయని ఓమార్ట్ సర్వే సంస్థ ప్రతినిధులు ఆర్. చెన్నయ్య (సీఈఓ), ప్రకాశ్‌రావు (అనలిస్ట్) తెలిపారు. బీజేపీకి ఎనిమిది, ఎంఐఎంకు ఏడు స్థానాలు వొస్తాయని అంచనా వేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఓమార్ట్ సర్వే ప్రతినిధులు మాట్లాడుతూ.. 2023 అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుతం రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయని తెలిపారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బలహీనపడిన బీఆర్ఎస్ తిరిగి పుంజుకుంటోందని, కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో మద్దతు తగ్గుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయని వివరించారు. కులాల వారీగా రెడ్డి సామాజికవర్గంలో కాంగ్రెస్‌కు మద్దతు ఉండగా, ఎస్సీ మాల వర్గంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య పోటీ కనిపిస్తోందన్నారు. ఇతర బీసీ, సామాజిక, వృత్తి వర్గాల్లో బీఆర్ఎస్ ఒకటి నుంచి ఐదు శాతం వరకు ఆధిక్యంలో ఉందని పేర్కొన్నారు. జిల్లాలు, నియోజకవర్గాల వారీగా నిర్వహించిన సర్వేలో కొన్ని చోట్ల హోరాహోరీ పోటీ ఉండగా, సిద్దిపేట, సిరిసిల్ల వంటి నియోజకవర్గాల్లో బలమైన ఆధిక్యం కనిపించిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వానికి రాబోయే రెండేళ్లు కీలకమని, సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి ద్వారా ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాల్సి ఉంటుందని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లోని మూడు ముస్లిం ప్రాబల్య ప్రాంతాల్లో ప్రత్యేక సర్వే నిర్వహిస్తున్నామని, త్వరలో ఫలితాలు వెల్లడిస్తామని తెలిపారు. ప్రస్తుత సర్వే ఫలితాలు ఇప్పటి పరిస్థితులకు సంబంధించిన అంచనాలు మాత్రమేనని, ఎన్నికల సమయానికి రాజకీయ సమీకరణాలు మారవచ్చని స్పష్టం చేశారు.





విద్యుత్ శాఖకు ఏసీబీ షాక్!

రూ.60 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఏడీఈ ఉద్యోగి

గద్వాల, నవంబర్ 26 (ఉద్యమ కెరటం): అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో గద్వాల పట్టణంలోని అడిషనల్ డివిజనల్ ఇంజినీరింగ్ (ఏడీఈ) కార్యాలయ ఉద్యోగి రమేష్‌బాబు పట్టుబడినట్లు సమాచారం. కృష్ణా రోడ్డులోని కార్యాలయంలో ఆయన రూ.60 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు ట్రాప్ చేసి అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని అరికట్టేందుకు ఏసీబీ చేపడుతున్న చర్యల్లో భాగంగా ఈ ఘటన చోటుచేసుకుంది. లంచం తీసుకుంటున్న సమయంలోనే అధికారులు దాడి చేయడంతో సంబంధిత కార్యాలయంలో కలకలం రేగింది. ఏ పనికి సంబంధించి రమేష్‌బాబు నగదు డిమాండ్ చేశారు? ఎవరి నుంచి లంచం తీసుకుంటున్నారు? అనే వివరాలు ఇంకా వెల్లడికాలేదు. ఘటనపై ఏసీబీ అధికారులు తదుపరి విచారణ కొనసాగిస్తున్నారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు, అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

మహిళల హక్కులకు రాజ్యాంగమే రక్షణ

- మహిళలకు సమాన హక్కులిచ్చింది రాజ్యాంగమే
- హక్కుల అమలులో కొనసాగుతున్న వివక్ష
- మహిళల చరిత్రను వారే రాసుకోవాలి
- తెలంగాణ రుద్రమ సేనగా మహిళా విభాగం పేరు మార్పు
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత



హైదరాబాద్, నవంబర్ 26 (ఉద్యమ కెరటం): మహిళలకు సమాన హక్కులు, స్వేచ్ఛ కల్పించింది భారత రాజ్యాంగమేనని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. రాజ్యాంగాన్ని ఆమోదించుకున్న నవంబర్ 26 మహిళలకు నిజమైన పండుగ రోజని పేర్కొన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా గురువారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీఆర్ఎస్ నిర్వహించిన 'మహిళలు-రాజ్యాంగం' సదస్సులో ఆమె మాట్లాడారు. మహిళలకు ఓటు హక్కుతో పాటు సమాన హక్కులు కల్పించిన రాజ్యాంగాన్ని యథాతథంగా అమలు చేస్తే వారి సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. మహిళలు ఉద్యోగాలు చేస్తున్నా పురుషులతో సమానంగా వేతనాలు, ఆస్తి హక్కులు పొందలేకపోతున్నారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. కులం, మతంతో సంబంధం లేకుండా అన్ని వర్గాల మహిళలు వివక్షను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సాయుధ రైతాంగ పోరాటం సహా అనేక ఉద్యమాల్లో మహిళలు కీలక పాత్ర పోషించినప్పటికీ చరిత్రలో వారికి తగిన గుర్తింపు దక్కలేదన్నారు. మహిళలు తమ పోరాట చరిత్రను తామే రాసుకోవాలని పిలుపునిచ్చారు. మహిళలపై అవమానాలు, దాడులు ఇప్పటికీ కొనసాగుతున్నాయని విమర్శించారు. సావిత్రిబాయి పూలే నాటి నుంచి నేటి వరకు మహిళలు ఎదుర్కొంటున్న వివక్షలో ఆశించిన మార్పు రాలేదన్నారు. ప్రేమను నిరాకరించిందనే కారణంతో విద్యార్థినిపై దాడి, హాస్టల్‌లో విద్యార్థిని ప్రసవించిన ఘటనలను ప్రస్తావిస్తూ మహిళల భద్రతపై ప్రభుత్వాలు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రక్షణ సేన మహిళా విభాగానికి 'తెలంగాణ రుద్రమ సేన'గా పేరు మారుస్తున్నట్లు కవిత ప్రకటించారు. ఈ మేరకు మహిళా నాయకులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. రుద్రమదేవి స్ఫూర్తితో మహిళలు తమ హక్కుల కోసం పోరాడాలని, ప్రతి ఇంటికీ వెళ్లి రాజ్యాంగంపై అవగాహన కల్పించాలని సూచించారు. అంతకుముందు అంబేద్కర్, గాంధీ, జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు నివాళులర్పించారు

కాంగ్రెస్ ద్వంద్వ వైఖరిని ప్రజలు ప్రశ్నించాలి

- ఈవీఎంలపై గెలుపోటములకో తీరు
- రేవంత్, రాహుల్ వ్యాఖ్యల్లో వైరుధ్యం
- రాజ్యాంగ రూపకల్పనలో తెలుగు ప్రముఖులు
- కేంద్ర మాజీ మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్



హైదరాబాద్, నవంబర్ 26 (ఉద్యమ కెరటం): ఎన్నికల్లో గెలిచినప్పుడు ఈవీఎంలు, ఎన్నికల సంఘం పనితీరును ప్రశంసిస్తూ.. ఓటమి ఎదురైనప్పుడు వాటిపైనే ఆరోపణలు చేయడం కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని కేంద్ర మాజీ మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ విమర్శించారు. దేశ ఆర్థిక వ్యవస్థపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విదేశాల్లో విమర్శలు చేస్తుంటే, 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెబుతున్నారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నేతల మాటల్లోని ఈ వైరుధ్యాన్ని ప్రజలు గమనించాలని, రాబోయే ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన సమాధానం చెబుతారని అన్నారు. బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన సంవిధాన్ సమ్మాన్ దివస్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భారత రాజ్యాంగం 1949 నవంబర్ 26న ఆమోదం పొందగా, 1950 జనవరి 26 నుంచి అమల్లోకి వచ్చిందని ఠాకూర్ గుర్తుచేశారు. రాజ్యాంగ రూపకల్పనలో అల్లాడి కృష్ణస్వామి అయ్యర్, పట్టాభి సీతారామయ్య, టంగుటూరి ప్రకాశం, ఎన్.జి. రంగా, దుర్గాబాయి దేశ్‌ముఖ్ వంటి తెలుగు ప్రముఖులు విశేష కృషి చేశారని పేర్కొన్నారు. నిజాం పాలన నుంచి విముక్తి అనంతరం 1948 సెప్టెంబర్ 17న సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ కృషితో హైదరాబాద్ భారతదేశంలో విలీనమైందని చెప్పారు. ఈ చారిత్రక నేపథ్యం కారణంగా ఒకే దేశం, ఒకే రాజ్యాంగం ప్రాధాన్యం హైదరాబాద్ ప్రజలకు బాగా తెలుసని అన్నారు. అంబేద్కర్ 125వ జయంతి సందర్భంగా 2015లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నవంబర్ 26ను రాజ్యాంగ దినోత్సవంగా ప్రకటించారని ఠాకూర్ తెలిపారు. అంబేద్కర్ జీవితంతో సంబంధం ఉన్న ఐదు ప్రాంతాలను బీజేపీ ప్రభుత్వం 'పంచ తీర్థాలు'గా అభివృద్ధి చేసిందని వివరించారు. రాజ్యాంగ పీఠిక, ప్రాథమిక హక్కులు, విధులు, ఓటు హక్కుపై ప్రతి పౌరుడికి అవగాహన ఉండాలని సూచించారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు, ఆర్టికల్ 370 రద్దు, బీసీ కమిషన్‌కు రాజ్యాంగ హోదా కల్పించడం వంటి చర్యలను తమ ప్రభుత్వం చేపట్టిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ గత పాలనపైనా అనురాగ్ ఠాకూర్ విమర్శలు చేశారు. అంబేద్కర్‌ను ఎన్నికల్లో ఓడించడంతో పాటు, ఆయనకు భారతరత్న పురస్కారం ఇవ్వకుండా దశాబ్దాల పాటు జాప్యం చేసిందని ఆరోపించారు. 1975లో ఎమర్జెన్సీ విధించి, 42వ రాజ్యాంగ సవరణ ద్వారా రాజ్యాంగ మౌలిక స్ఫూర్తిని మార్చేందుకు ప్రయత్నించిందని విమర్శించారు. ఆ సమయంలో స్నేహలతా రెడ్డి వంటి పోరాట యోధులను జైలులో నిర్బంధించారని అన్నారు. ఆర్టికల్ 356ను దుర్వినియోగం చేసి 90కిపైగా ప్రభుత్వాలను కూల్చివేసిందని, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకాల్లో సీనియారిటీని కూడా పట్టించుకోలేదని ఆరోపించారు. 1984 సిక్కుల ఊచకోతతో పాటు, సొంత పార్టీ నేతలైన పీవీ నరసింహారావు, సీతారాం కేసరిల పట్ల వ్యవహరించిన తీరుపై కాంగ్రెస్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగాలపై ప్రశ్నిస్తే దాడులు చేస్తారా?

- బావర్చి ఘటనపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం
- బీఆర్ఎస్ యువ నాయకులపై దాడిని ఖండించిన కేటీఆర్
- రాజ్యాంగ దినోత్సవం రోజునే ప్రజాస్వామ్య హక్కులపై దాడి
- నిరసన తెలిపే హక్కు లేదా?.. రాహుల్ గాంధీకి ప్రశ్న
- దాడికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలకు డిమాండ్



హైదరాబాద్, నవంబర్ 26 (ఉద్యమ కెరటం): నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాల హామీని అమలు చేయాలని ప్రశ్నిస్తే దాడులు చేస్తారా? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని బావర్చి హోటల్ వద్ద నిరసన తెలిపిన బీఆర్ఎస్ యువ నాయకులపై కాంగ్రెస్ నాయకులు, వారి అనుచరులు దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ప్రతిపక్షాలకు ఉందని, ఆ గొంతులను అణచివేయాలని చూడటం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. రాజ్యాంగ దినోత్సవం రోజునే ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం దురదృష్టకరమన్నారు. మూడేళ్ల క్రితం బావర్చి హోటల్‌లో బిర్యానీ తింటూ తెలంగాణ యువతకు రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని కేటీఆర్ గుర్తుచేశారు. ఆ హామీని గుర్తుచేస్తూ మన్నె క్రిశాంక్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ చిత్రపటంతో భోజన కార్యక్రమం నిర్వహించడం తప్పా? అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా మన్నె క్రిశాంక్, ముఠా జైసింహ, జగన్ పాటిమీది, దినేశ్ చౌదరి, విష్ణువర్ధన్ రెడ్డి, హరీశ్ రెడ్డిలపై దాడి జరిగిందని తెలిపారు. స్వయంగా ఓ రాజ్యసభ సభ్యుడే తన అనుచరులతో కలిసి దాడికి నాయకత్వం వహించారని ఆరోపించారు. సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగానూ కేటీఆర్ స్పందించారు. రాజ్యాంగం కల్పించిన నిరసన తెలిపే హక్కు ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు గురించి రాహుల్ గాంధీ తన పార్టీ నాయకులకు గుర్తుచేయాలని సూచించారు. ఎన్నికల హామీలను గుర్తుచేస్తే హింసతో సమాధానం చెప్పడం ఏమిటని నిలదీశారు. రాజ్యాంగ విలువల గురించి మాట్లాడే కాంగ్రెస్ వాటిని ఆచరణలో కాపాడాలని హితవు పలికారు. బావర్చి ఘటనకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని, దాడికి పాల్పడిన వారితోపాటు దానికి నాయకత్వం వహించిన వారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, బావర్చి హోటల్ వద్ద బీఆర్ఎస్ నాయకులు నిరసన చేపట్టిన సమయంలో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, అరవింద్ యాదవ్ తమ అనుచరులతో అక్కడికి చేరుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం, ఘర్షణ చోటుచేసుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఓ కారుపైనా దాడి జరిగినట్లు తెలిసింది. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు పోలీసులు లాఠీచార్జ్ చేసినట్లు సమాచారం.





ప్రభుత్వ పాఠశాలలో సైన్స్ ఫేర్ నిర్వహించలేరా?

మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు

ప్రైవేట్ విద్యాసంస్థలో ప్రదర్శనపై అభ్యంతరం

సిద్దిపేట, నవంబర్ 26 (ఉద్యమ కెరటం): జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహణకు ప్రైవేట్ విద్యాసంస్థను వేదికగా ఎంపిక చేయడంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించాల్సిన సైన్స్ ఫేర్‌ను ప్రైవేట్ విద్యాసంస్థలో ఏర్పాటు చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. కనీసం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించాల్సిన వైజ్ఞానిక ప్రదర్శనను కూడా అదే పాఠశాలలో జరిపే పరిస్థితి లేదా? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో సిద్దిపేట విద్యార్థులు సైన్స్ ఫేర్‌లో జాతీయ స్థాయి అవార్డులు సాధించారని హరీశ్‌రావు గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వైజ్ఞానిక ప్రదర్శనల నిర్వహణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. సిద్దిపేటపై వివక్షతోనే ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. విద్యార్థుల సంక్షేమ పథకాల అమలులోనూ ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోందన్నారు. సిద్దిపేటలో విద్యార్థులకు అందించాల్సిన బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. విద్యా సంవత్సరం సగం పూర్తవుతున్నా ఇప్పటివరకు ఒక్క జత యూనిఫాం మాత్ర మే పంపిణీ చేశారన్నారు. విద్యార్థులకు మిగిలిన యూనిఫాంలను వెంటనే అందించాలని, బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని పూర్తిస్థాయిలో ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రేవంత్ భ్రమల్లో బతుకుతున్నారు

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటమి తప్పదు

బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ విమర్శలు



హుజూరాబాద్, నవంబర్ 26 (ఉద్యమ కెరటం): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భ్రమల్లో జీవిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో ఆయనకు ఓటమి తప్పదని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు. గురువారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో పర్యటించిన ఆయన పలు స్థానిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి పనితీరుపై విమర్శలు గుప్పించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 90 శాతం సీట్లు వస్తాయనే అంచనాలో రేవంత్‌రెడ్డి ఉన్నారని ఈటల ఎద్దేవా చేశారు. వాస్తవానికి రాష్ట్రంలో ప్రజా సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాబోయే 10 నుంచి 15 ఏళ్ల వరకు కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదని ఆ పార్టీ కార్యకర్తలే చెబుతున్నారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి వంద శాతం ఓడిపోవడం ఖాయమని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలు, అవినీతిపై కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు తీసుకున్న చర్యలేమిటో వెల్లడించాలని ఈటల డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో చోటుచేసుకున్న అవినీతిపై చర్యలు తీసుకోకుండా ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. ప్రకటనలకే పరిమితం కాకుండా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

వివాహేతర సంబంధం.. భర్తను హత్య చేసిన భార్య

ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



వెంకటాపురం, నవంబర్ 26: వివాహేతర సంబంధం ఓ కుటుంబంలో విషాదాన్ని నింపింది. తన సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడని భావించిన ఓ మహిళ.. ప్రియుడు, మరో వ్యక్తి సాయంతో భర్తను హత్య చేసిన ఘటన ములుగు జిల్లా వెంకటాపురం (నూగూరు) మండల కేంద్రంలోని బీసీ మర్రిగూడెం డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కాలనీలో నివాసముంటున్న పూనెం నాగరాజుకు జ్యోతితో వివాహమైంది. కొంతకాలంగా వీరు అక్కడే ఉంటున్నారు. ఈ క్రమంలో జ్యోతికి బెస్తగూడెం గ్రామానికి చెందిన గుండారపు సత్యంతో పరిచయం ఏర్పడి, అది వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈ విషయం తెలుసుకున్న నాగరాజు పలుమార్లు భార్యను హెచ్చరించినా ఆమె వైఖరిలో మార్పు రాలేదు. తమ సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడని భావించిన జ్యోతి, సత్యంతో కలిసి నాగరాజును హతమార్చేందుకు పథకం వేసినట్లు సమాచారం. ఇందులో భాగంగా బుధవారం రాత్రి సత్యం, ప్రశాంత్ అనే మరో వ్యక్తి సహకారంతో నాగరాజు గొంతు నులిమి హత్య చేసినట్లు తెలుస్తోంది. అనంతరం ఘటనను ఆత్మహత్యగా నమ్మించేందుకు ఇంట్లోనే మృతదేహాన్ని ఉరివేసినట్లు సమాచారం. నాగరాజు మృతిపై అనుమానం వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టిన పోలీసులు హత్య కోణాన్ని గుర్తించి అసలు విషయాన్ని వెలుగులోకి తెచ్చారు. పోలీసుల విచారణలో నిందితులు నేరాన్ని అంగీకరించినట్లు తెలిసింది. ఈ ఘటనలో పాల్గొన్న జ్యోతి, సత్యం, ప్రశాంత్‌లను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో విషాదం అలుముకుంది

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక

సంపాదకీయం



ట్రంప్ 25 శాతం టారిఫ్స్ వార్నింగ్

భారత 'మేకిన్ ఇండియా'కు సవాళ్లు..!

భారత్‌పై 25 శాతం సుంకాలు విధించనున్నట్లు ట్రంప్ సర్కారు చేసిన హెచ్చరికలు భారత మేకిన్ ఇండియా ప్రక్రియకు సవాల్‌గా మారాయి. ప్రపంచ తయారీ కేంద్రంగా మారాలన్న భారతదేశ ఆశయానికి ఈ టారిఫ్ భయాలు అడ్డంకి మారాయి. ప్రపంచ సరఫరా గొలుసులను చైనాకు దూరం చేయడం గురించి పదేపదే మాట్లాడుతున్న అమెరికా.. ఇప్పుడు భారత్ తన తయారీ రంగాన్ని నిర్మించుకోవడానికి అనుసరిస్తున్న కొన్ని విధానాలను కూడా ప్రశ్నిస్తున్నది. అంతర్జాతీయ వాణిజ్య సమీకరణాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్న వేళ, అమెరికా తీసుకుంటున్న కఠిన నిర్ణయాలు భారతీయ పారిశ్రామిక రంగానికి కొత్త పరీక్షగా నిలుస్తున్నాయి.

'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మనిర్భర్ భారత్', 'ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్' వంటి కార్యక్రమాలపై డొనాల్డ్ ట్రంప్ సర్కారు కన్నేసింది. ప్రభుత్వ మద్దతుతో జరిగే తయారీరంగ విస్తరణ దేశీయ మార్కెట్‌కు అవసరమైన దానికంటే ఎక్కువ ఉత్పత్తి సామర్థ్యాన్ని సృష్టిస్తుందని, ఇది భారతీయ కంపెనీలు తమ మిగులు ఉత్పత్తులను విదేశాలకు అమ్ముకునేలా చేసి అమెరికన్ తయారీదారులపై ఒత్తిడిని పెంచుతుందని అగ్రరాజ్యం వాదిస్తున్నది. స్వదేశీ పరిశ్రమలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, రాయితీలు, ఆర్థిక మద్దతు విధానాల వల్ల ప్రపంచ మార్కెట్‌లో అసమాన పోటీ తలెత్తుతోందన్న అభిప్రాయాన్ని అమెరికా యంత్రాంగం బలంగా వినిపిస్తోంది. తయారీ సామర్థ్యం, ఉత్పత్తికి సంబంధించి భారతదేశ విధానాలు అసమంజసంగా ఉన్నాయని, అమెరికా వాణిజ్యాన్ని పరిమితం చేస్తున్నాయని యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ (యూఎస్‌టీఆర్) నిర్ధారించింది. కొన్ని ఉత్పత్తులకు మినహాయింపులతో ఇప్పటికే ఉన్న సెక్షన్ 301 సుంకాలకు అదనంగా భారతీయ వస్తువులపై 25 శాతం వరకు అదనపు సుంకాలను విధించాలని యూఎస్‌టీఆర్ ప్రతిపాదించింది. అయితే ఒక వెసులుబాటు ఉండే అవకాశం ఉంది. విచారణలో లేవనెత్తిన ఆందోళనలను పరిష్కరించేలా భారత్, వాషింగ్టన్ మధ్య ఏదైనా వాణిజ్య ఒప్పందం కుదిరితే, ప్రతిపాదిత రేటును 17 శాతానికి సర్దుబాటు చేయవచ్చు. ఇరుదేశాల మధ్య జరిగే ద్వైపాక్షిక చర్చలు, సయోధ్య ప్రయత్నాల ఫలితంగా సుంకాల భారాన్ని కొంతమేర తగ్గించుకునే అవకాశం ఉన్నప్పటికీ, ప్రాథమికంగా ప్రకటించిన 25 శాతం ప్రతిపాదన ఎగుమతిదారుల్లో ఆందోళన రేకెత్తిస్తోంది. భారతీయ తయారీ రంగంలో కీలక రంగాలైన ఎలక్ట్రానిక్స్, ఇంజినీరింగ్ వస్తువులు, ఆటోమొబైల్ విడిభాగాలు, రసాయనాలు, టెక్స్‌టైల్స్ వంటి రంగాలపై అమెరికా సుంకాల ప్రభావం పడే అవకాశం ఉందని వాణిజ్య విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికే అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ హెచ్చుతగ్గులు, రవాణా ఖర్చుల ఒత్తిడుల మధ్య పనిచేస్తున్న భారతీయ సంస్థలకు అదనపు పన్నుల భారం తోడైతే అమెరికా మార్కెట్‌లో ధరల పోటీని తట్టుకోవడం కష్టతరమవుతుందని అంచనా వేస్తున్నారు. మరోవైపు, చైనా నుంచి సరఫరా గొలుసులను వైవిధ్యపరచాలనే ఆలోచనలో ఉన్న విదేశీ సంస్థలు భారత్ వైపు మొగ్గు చూపుతున్న తరుణంలో, టారిఫ్ అనిశ్చితి పెట్టుబడి నిర్ణయాల వేగంపై ప్రభావం చూపే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. పన్ను వివాదాల నిర్వహణ నిపుణుడు మనోజ్ మిశ్రా.. యూఎస్‌టీఆర్ ప్రతిపాదన భారత్-అమెరికా వాణిజ్య సంబంధాల చుట్టూ ఉన్న అనిశ్చితిని మరింత పెంచుతుందని తెలిపారు. 'ఇప్పటికే ఉన్న సెక్షన్ 301 సుంకాలను మినహాయించి, కొన్ని మినహాయింపులకు లోబడి, భారతీయ వస్తువులపై 25 శాతం వరకు సుంకాలను విధించాలన్న అమెరికా ప్రతిపాదన భారత్-అమెరికా వాణిజ్య సంబంధాల చుట్టూ ఉన్న అనిశ్చితిని మరింత పెంచుతుంది. 'మేక్ ఇన్ ఇండియా', 'పిఎల్‌ఐ'తో సహా భారతదేశపు కీలక పారిశ్రామిక కార్యక్రమాలు యూఎస్‌టీఆర్ పరిశీలనలోకి వస్తున్న తరుణంలో ఈ ప్రతిపాదిత చర్యలు భారతదేశపు ఎగుమతి పోటీతత్వాన్ని బలహీనపరిచి, లాభాల మార్జిన్‌లపై ఒత్తిడిని పెంచి, తయారీ రంగ పెట్టుబడులను నిరుత్సాహపుస్తాయి' అని అన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో భారత వాణిజ్య, పరిశ్రమల వర్గాలు, విధాన నిర్ణేతలు అమెరికా వాణిజ్య ప్రతినిధి కార్యాలయం లేవనెత్తిన అంశాలపై లోతుగా విశ్లేషించి, చర్చల ద్వారా పరిష్కార మార్గాలను అన్వేషించాల్సిన అవసరం ఏర్పడింది. స్వదేశీ తయారీ రంగాన్ని బలోపేతం చేస్తూనే, అంతర్జాతీయ వాణిజ్య నిబంధనలు, భాగస్వామ్య దేశాల ఆందోళనలకు సమతుల్యంగా స్పందించడం ద్వారా దీర్ఘకాలికంగా 'మేక్ ఇన్ ఇండియా' లక్ష్యాలను సాధించాలని నిపుణులు సూచిస్తున్నారు. వాణిజ్య ఒప్పంద చర్చల్లో స్పష్టత వచ్చే వరకు ఎగుమతి సంస్థలు, తయారీదారులు అప్రమత్తంగా వ్యవహరిస్తూ ప్రత్యామ్నాయ మార్కెట్లు, వ్యూహాలపై దృష్టి సారించాల్సిన పరిస్థితి నెలకొంది.



పార్లమెంట్‌లో కీలక ఘట్టానికి తెర!

- ఈ నెల 30న లోక్‌సభ.. డిసెంబర్ 2న రాజ్యసభ సమావేశాలు
- డిసెంబర్ 3 వరకు సభా కార్యకలాపాలు
- మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజనపై ఉత్కంఠ
- లోక్‌సభ స్థానాలను 850 వరకు పెంచే ప్రతిపాదన?
- ప్రాతినిధ్యం తగ్గుతుందనే ఆందోళనలో దక్షిణాది రాష్ట్రాలు
- పార్లమెంట్ సమావేశాలపై కాంగ్రెస్ వ్యూహరచన



న్యూఢిల్లీ, నవంబర్ 26 (ఉద్యమ కెరటం): పార్లమెంట్ ఉభయ సభలను తిరిగి సమావేశపరచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 30న లోక్‌సభను, డిసెంబర్ 2న రాజ్యసభను సమావేశపరచాలని కోరినట్లు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. డిసెంబర్ 3 వరకు సభా కార్యకలాపాలు కొనసాగించే అవకాశముందని తెలిపారు. ఇవి కొత్త సమావేశాలు కాదని, గత వర్షాకాల సమావేశాల కొనసాగింపుగానే పరిగణించనున్నట్లు స్పష్టం చేశారు. కీలకమైన ప్రభుత్వ కార్యకలాపాలను పూర్తి చేయడమే ఈ సమావేశాల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. అయితే సమావేశాల పూర్తి కార్యాచరణను ప్రభుత్వం ఇంకా వెల్లడించలేదు. ప్రతిపక్షాల నిరసనలు, ఆందోళనల నేపథ్యంలో గత ఆగస్టు 13న పార్లమెంట్ ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. అయితే వర్షాకాల సమావేశాలను అధికారికంగా ముగించకపోవడంపై రాజకీయ వివాదం నెలకొంది. నియోజకవర్గాల పునర్విభజన కోసమే శీతాకాల సమావేశాలను కేంద్రం ఆలస్యం చేస్తోందని ప్రతిపక్షాలు ఆరోపించాయి. రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగానే ప్రభుత్వం వ్యవహరిస్తోందని అధికార ఎన్డీఏ ఈ ఆరోపణలను ఖండించింది. తాజా సమావేశాల్లో నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్లకు సంబంధించిన రాజ్యాంగ సవరణను కేంద్రం ప్రవేశపెట్టే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాలను గరిష్ఠంగా 850 వరకు పెంచే ప్రతిపాదన పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే లోక్‌సభతోపాటు రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనే లక్ష్యంతో కేంద్రం ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన చేపడితే లోక్‌సభలో తమ ప్రాతినిధ్య వాటా తగ్గిపోయే ప్రమాదముందని దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో అన్ని రాష్ట్రాల్లో ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానాలను 50 శాతం చొప్పున పెంచే ప్రత్యామ్నాయాన్ని కేంద్రం పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. 1971 జనాభా లెక్కల ఆధారంగా రాష్ట్రాల మధ్య కొనసాగుతున్న ప్రస్తుత సీట్ల పంపిణీ నిష్పత్తిని యథాతథంగా కొనసాగించే అంశం కూడా పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. అయితే ఈ ప్రతిపాదనలపై కేంద్రం ఇంకా తుది నిర్ణయం ప్రకటించలేదు. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ వ్యూహరచనకు సిద్ధమైంది. శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు ఢిల్లీలో కాంగ్రెస్ పార్లమెంటరీ వ్యూహ బృందం సమావేశం కానుంది. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకురాలు సోనియా గాంధీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో పార్లమెంట్‌లో లేవనెత్తాల్సిన అంశాలు, ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన విషయాలు, పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించనున్నారు. మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన వంటి కీలక అంశాలపై కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే ఉత్కంఠ రాజకీయ వర్గాల్లో నెలకొంది.

మొబైల్ ఫోన్లు, మైకులు పట్టుకున్న వారు జర్నలిస్టులు కాదు..

జర్నలిస్టులు, రీల్ క్రియేటర్ల మధ్య తేడాపై సుప్రీం విచారణ..

వార్తా సేకరణ సమయంలో జర్నలిస్టులకు భద్రతపై దృష్టి

జర్నలిస్టులపై దాడుల ఆరోపణల విచారణకు ఉన్నతస్థాయి కమిటీ



న్యూఢిల్లీ, నవంబర్ 26 (ఉద్యమ కెరటం): మొబైల్ ఫోన్, మైక్ పట్టుకున్న ప్రతి ఒక్కరినీ జర్నలిస్టుగా పరిగణించాలా? వృత్తిపరమైన జర్నలిస్టులకు, సామాజిక మాధ్యమాల్లో వీడియోలు రూపొందించే వారికి మధ్య తేడాలను ఎలా గుర్తించాలి? అనే కీలక అంశాలపై సుప్రీంకోర్టు దృష్టి సారించింది. జర్నలిస్టుల చట్టపరమైన గుర్తింపు, వార్తా సేకరణ సమయంలో వారికి కల్పించాల్సిన రక్షణకు సంబంధించిన అంశాలపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఢిల్లీలో అక్టోబర్ 10, 11 తేదీల్లో జరిగిన నిరసనల సందర్భంగా ఏడుగురు జర్నలిస్టులను నిర్బంధించడంతోపాటు వారిపై దాడి చేసి, వార్తా సేకరణకు ఆటంకం కలిగించారనే ఆరోపణల నేపథ్యంలో ఈ విచారణకు ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ఘటనపై ఢిల్లీ జర్నలిస్టుల యూనియన్, కేరళ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్, స్వతంత్ర జర్నలిస్టు పరంజోయ్ గుహా ఠాకుర్తా తదితరులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దాడుల ఆరోపణల్లో వాస్తవాలను నిగ్గుతేల్చేందుకు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆర్. సుభాష్ రెడ్డి నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీని సర్వోన్నత న్యాయస్థానం ఏర్పాటు చేసింది. నిరసనలు, భారీ ప్రదర్శనలు, జనసమూహాల మధ్య వార్తలు సేకరించే జర్నలిస్టులకు పోలీసులు, ఇతర అధికారుల నుంచి ఎలాంటి రక్షణ కల్పించాలనే అంశాన్ని పరిశీలించనున్నట్లు జస్టిస్ జయమాల్య బాగ్చి పేర్కొన్నారు. వార్తా సేకరణ సమయంలో జర్నలిస్టులను అనవసరంగా నిర్బంధించడం, దాడులకు పాల్పడటం, విధులకు ఆటంకం కలిగించడం వంటి ఘటనల నివారణపై న్యాయస్థానం దృష్టి సారించింది. అయితే జర్నలిస్టులకు ప్రత్యేక రక్షణ కల్పించడం అంటే చట్టం నుంచి మినహాయింపు ఇవ్వడం కాదని, పోలీసుల చట్టబద్ధమైన ఆదేశాలను వారు కూడా పాటించాల్సిందేనని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రభుత్వ గుర్తింపు పొందిన జర్నలిస్టులు, నమోదిత మీడియా సంస్థల్లో పనిచేసే పాత్రికేయులు, స్వతంత్ర జర్నలిస్టులతోపాటు సామాజిక మాధ్యమాల్లో సమాచారాన్ని అందించే వారికి ఒకే తరహా భద్రతా నిబంధనలు వర్తింపజేయాలా? లేక వృత్తిపరమైన జర్నలిస్టులకు ప్రత్యేక రక్షణ కల్పించాలా? అనే అంశం విచారణలో కీలకంగా మారింది. మరోవైపు సామాజిక మాధ్యమ ప్రభావకర్తలు, రీల్ క్రియేటర్లను వృత్తిపరమైన జర్నలిస్టుల నుంచి వేరుగా గుర్తించాలని ఢిల్లీ పోలీసులు సుప్రీంకోర్టులో వాదించారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరి చేతిలో మొబైల్ ఫోన్లు, మైకులు ఉంటుండటంతో వార్తలు సేకరించే జర్నలిస్టులకు, నిరసనల్లో పాల్గొనే వ్యక్తులకు మధ్య తేడాను గుర్తించడం కష్టంగా మారిందని పేర్కొన్నారు. వృత్తిపరమైన జర్నలిస్టులకు మాత్రమే ప్రత్యేక భద్రతా నిబంధనలు వర్తింపజేయాలని కోరారు. అరెస్టయిన తర్వాత తాము జర్నలిస్టులమని చెప్పుకునే వారికి ప్రత్యేక రక్షణ కల్పించకూడదని వాదించారు. ఈ నేపథ్యంలో జర్నలిస్టుల వృత్తిపరమైన గుర్తింపు, హక్కులు, భద్రతకు సంబంధించి సుప్రీంకోర్టు ఎలాంటి మార్గదర్శకాలు రూపొందిస్తుందనే ఆసక్తి మీడియా వర్గాల్లో నెలకొంది.

వ్యాపారులకు కేంద్రం ఊరట

ఇక క్షణాల్లో జీఎస్టీ రిజిస్ట్రేషన్ రద్దు..



న్యూఢిల్లీ, నవంబర్ 26 (ఉద్యమ కెరటం): వ్యాపారులకు, పన్ను చెల్లింపుదారులకు కేంద్ర ప్రభుత్వం ఒక గొప్ప శుభవార్త అందించింది. ఇకపై జీఎస్టీ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసుకోవడానికి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. 2026, డిసెంబర్ 1వ తేదీ నుంచి ఈ ప్రక్రియను పూర్తిగా ఆన్‌లైన్‌లోనే చేసుకునేలా కేంద్ర ఆర్థిక శాఖ కొత్త నిబంధనలను తీసుకువచ్చింది. ఇందుకోసం 2017 నాటి జీఎస్టీ నియమాలలో కీలక మార్పులు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త నిబంధనల ప్రకారం ఎవరైనా తమ జీఎస్టీ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసుకోవాలనుకుంటే, ముందుగా తమ చివరి పన్ను కాలానికి సంబంధించిన రిటర్నులను దాఖలు చేయాలి. అలాగే ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు, ఇతర బకాయిలన్నీ పూర్తిగా చెల్లించాలి. ఆ తర్వాత ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా రద్దు కోసం దరఖాస్తు చేసుకుంటే, అధికారుల ప్రమేయం లేకుండానే నేరుగా పోర్టల్ ద్వారానే రిజిస్ట్రేషన్ రద్దు అవుతుంది. దరఖాస్తులో పేర్కొన్న తేదీ నుంచే ఈ రద్దు అమల్లోకి వస్తుంది. దీనికి సంబంధించిన సమాచారాన్ని పన్ను చెల్లింపుదారులకు 'ఫామ్ జీఎస్టీ ఆర్‌ఈజీ-38' ద్వారా ఆన్‌లైన్‌లోనే పంపిస్తారు. ఒకవేళ దరఖాస్తుదారుడు తమ రిటర్నులను సరిగ్గా దాఖలు చేయకపోయినా, లేదా ప్రభుత్వానికి కట్టాల్సిన పన్నులు, వడ్డీలు, జరిమానాలు ఏవైనా బాకీ ఉన్నా ఆ దరఖాస్తు ఆటోమేటిక్‌గా రద్దు కాదు. అలాంటి దరఖాస్తులు సంబంధిత అధికారి పరిశీలనకు వెళ్తాయి. అన్ని బకాయిలు క్లియర్ చేస్తేనే సులభంగా ఆన్‌లైన్‌లో పని పూర్తవుతుంది. కొత్తగా జీఎస్టీ రిజిస్ట్రేషన్ చేసుకునే వారి కోసం కూడా ప్రభుత్వం పోర్టల్‌లో మరిన్ని మార్పులు చేసింది. దరఖాస్తు ఫామ్ నింపేటప్పుడు ఎలాంటి తప్పులు జరగకుండా ఎప్పటికప్పుడు సూచనలు కనిపించేలా వెసులుబాటు కల్పించింది. పత్రాలను సులభంగా అప్‌లోడ్ చేసేందుకు డ్రాప్-డౌన్ బాక్సులను కూడా చేర్చింది. రిజిస్ట్రేషన్ చేసుకునే పూర్తి విధానాన్ని తెలుసుకోవడానికి జీఎస్టీ వెబ్‌సైట్‌లోని 'హెల్ప్' విభాగంలో ఉన్న 'జీఎస్టీ నాలెడ్జ్ పోర్టల్' ద్వారా స్టెప్-బై-స్టెప్ గైడ్‌ను కూడా అందుబాటులో ఉంచింది.

మదుపర్లకు సెబీ ఊరట

కేవైసీ నిబంధనలు సరళతరం!

డిసెంబర్ 24 నుంచి కొత్త నిబంధనలు అమలు



ముంబై, నవంబర్ 26 (ఉద్యమ కెరటం): స్టాక్ మార్కెట్ మదుపర్లకు భారతీయ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజ్ బోర్డు (సెబీ) కీలక ఊరటనిచ్చింది. ఖాతాల ప్రారంభ ప్రక్రియను మరింత సులభతరం చేస్తూ కేవైసీ నిబంధనల్లో మార్పులు ప్రకటించింది. వేర్వేరు బ్రోకరేజ్ సంస్థల వద్ద ఖాతాలు తెరిచే సమయంలో ఒకే రకమైన పత్రాలను పదేపదే సమర్పించాల్సిన అవసరం లేకుండా చర్యలు చేపట్టింది. మధ్యవర్తిత్వ సంస్థల మధ్య సమాచార మార్పిడిని మెరుగుపరచడంతోపాటు మదుపర్ల వ్యక్తిగత సమాచార భద్రతకు ప్రాధాన్యం కల్పించింది. కొత్త నిబంధనల ప్రకారం ఖాతా ప్రారంభ దరఖాస్తులోని రెండో భాగంలో ఉండే సాధారణ అదనపు సమాచారాన్ని కేవైసీ నమోదు సంస్థ (కేఆర్ఏ) స్థాయిలోనే కేంద్రీకరించనున్నారు. సీకేవైసీ గుర్తింపు సంఖ్య, డిజిపిన్, అధికారిక పత్రాల చెల్లుబాటు గడువు వివరాలను కేఆర్ఏ వ్యవస్థలో నమోదు చేయాల్సి ఉంటుంది. మదుపర్ల మొబైల్ నంబర్ ఇప్పటికే ఆధార్‌తో అనుసంధానమై, కేఆర్ఏ వ్యవస్థలో ధ్రువీకరణ పూర్తయితే మధ్యవర్తిత్వ సంస్థలు మళ్లీ తనిఖీ చేయాల్సిన అవసరం ఉండదు. పేరు మార్పు విషయంలోనూ సెబీ వెసులుబాటు కల్పించింది. పాన్, ఆధార్ కార్డుల్లో పేరు మార్పు పూర్తయితే అదనపు ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదు. లేకపోతే వివాహ ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు వంటి పత్రాలను అందించాల్సి ఉంటుంది. ఆదాయపు పన్ను చట్టం-2025 ప్రకారం భారతీయ నివాసితులుగా అర్హత పొందిన ఓసీఐ కార్డుదారులు, విదేశీయులు భారతీయ చిరునామా రుజువును సమర్పిస్తే విదేశీ చిరునామాకు సంబంధించిన పత్రాలు ఇవ్వాల్సిన అవసరం ఉండదు. మదుపర్ల ఖాతాలు మూసివేసినప్పుడు లేదా మ్యూచువల్ ఫండ్ ఫోలియోలో వరుసగా ఆరు నెలలపాటు ఎలాంటి లావాదేవీలు లేకుండా నిల్వ సున్నాగా ఉన్నప్పుడు ఐదు పనిదినాల్లోగా కేఆర్ఏకు సమాచారం అందించాల్సి ఉంటుంది. తద్వారా అవసరం లేని సంస్థలతో మదుపర్ల వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవడాన్ని నివారించనున్నారు. కేవైసీ వివరాలను ధ్రువీకరించినవి, ధ్రువీకరించనివిగా కేఆర్ఏలు వర్గీకరించనున్నాయి. ఈ కొత్త నిబంధనలు డిసెంబర్ 24 నుంచి అమల్లోకి రానున్నాయి.

అర్హులైన ప్రతి కుటుంబానికి బీమా పథకం అందాలి

జిల్లా కలెక్టర్ రాజర్షిషా



ఉద్యమ కెరటం, ఆదిలాబాద్: అర్హులైన ప్రతి కుటుంబానికి బీమా పథకం అందేలా చూడాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని రాంనగర్‌లో కొనసాగుతున్న 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం' దరఖాస్తుల స్వీకరణ, నమోదు ప్రక్రియను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దరఖాస్తుల నమోదు కేంద్రాన్ని సందర్శించి పనుల పురోగతి, సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుదారుల ఆధార్ కార్డు, రేషన్ కార్డు తదితర గుర్తింపు పత్రాల ఆధారంగా ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేస్తున్న విధానాన్ని స్వయంగా పరిశీలించారు. లబ్ధిదారుల వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడమే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. దరఖాస్తుల నమోదుకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. నిర్ణీత గడువులోగా దరఖాస్తుల స్వీకరణ, వివరాల నమోదు, ధ్రువీకరణ ప్రక్రియను వంద శాతం పూర్తి చేయాలని పేర్కొన్నారు. అనంతరం నమోదు కేంద్రానికి వచ్చిన స్థానిక ప్రజలతో నేరుగా మాట్లాడారు. దరఖాస్తుల సమర్పణలో ఏవైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా, సిబ్బంది సహకారం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ పథకం అమలును సమర్థవంతంగా చేపట్టాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ అనూష, కమిషనర్ జగదీష్ గౌడ్, స్థానిక కౌన్సిలర్, వార్డు అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజా భద్రత కోసం పనిచేస్తే కేసులా..

- **ఎన్‌జీఓ తీరుపై మండిపడ్డ సర్పంచ్ మాధవనేని భానుప్రసాద్**

ఉద్యమ కెరటం, దుబ్బాక: గ్రామ ప్రజల భద్రత కోసం పనిచేయడమే నేరమైతే ఆ పోరాటానికి తాను సిద్ధమని బొప్పాపూర్ సర్పంచ్ మాధవనేని భానుప్రసాద్ స్పష్టం చేశారు. వీధి కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకున్నందుకు ఎన్‌జీఓ సభ్యుడు అడులాపురం గౌతమ్ దాఖలు చేసిన కేసులో భాగంగా సర్పంచ్ మాధవనేని భానుప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు, నాయకులు వంగ నరేష్ గౌడ్, మంగలి నరేష్ గురువారం దుబ్బాక కోర్టులో మొదటి వాయిదాకు హాజరయ్యారు. ఈ సందర్భంగా భానుప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ ఎన్‌జీఓల ఏకపక్ష వైఖరిపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. జంతు ప్రేమ పేరుతో సామాన్య ప్రజల ప్రాణాలను ఫణంగా పెట్టడం సరికాదన్నారు. సమస్య పరిష్కారానికి సహకరించాల్సిన స్వచ్ఛంద సంస్థలు ప్రజాప్రతినిధులపై కక్షపూరితంగా కేసులు పెట్టడం తగదని పేర్కొన్నారు. ఈ వ్యవహారంతో ఎలాంటి సంబంధం లేని పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులును కేసులో చేర్చడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులను అనవసర వివాదాల్లోకి లాగి వారి మనోస్థైర్యాన్ని దెబ్బతీయవద్దని హితవు పలికారు. న్యాయస్థానంపై తనకు పూర్తి గౌరవం ఉందని, చట్టపరంగానే తన వాదనను వినిపిస్తానని తెలిపారు. తప్పుడు కేసులతో తన ప్రజాసేవను ఎవరూ



అడ్డుకోలేరని, బొప్పాపూర్ గ్రామ ప్రజల సంక్షేమం కోసం ఎలాంటి పరిస్థితుల్లోనూ వెనకడుగు వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

- **అంబేద్కర్ విగ్రహానికి కలెక్టర్, ఎస్పీ, మున్సిపల్ చైర్‌పర్సన్ నివాళులు**

ఉద్యమ కెరటం, ఆదిలాబాద్: పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో గురువారం మాల, మహార్, నేతకాని అనుబంధ కులాల జేఏసీ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ ముఖ్య అతిథులుగా హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్



మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులతో పాటు పౌర బాధ్యతలను ప్రతిఒక్కరూ గుర్తించి ఆచరించాలన్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ సమానత్వం, సామాజిక న్యాయం, సోదరభావమే రాజ్యాంగ స్ఫూర్తి అని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను ఆచరిస్తూ విద్య, సామాజిక చైతన్యంతో సమాజ అభ్యున్నతికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సునిత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్, వివిధ శాఖల అధికారులు, జేఏసీ నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

'జై విధాన్– జై సంవిధాన్' ర్యాలీకి కదిలిన సిద్దిపేట కాంగ్రెస్ శ్రేణులు

ఉద్యమ కెరటం, సిద్దిపేట: భారత రాజ్యాంగ పరిరక్షణే లక్ష్యంగా హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై నిర్వహిస్తున్న 'జై విధాన్– జై సంవిధాన్' మహా ర్యాలీని విజయవంతం చేసేందుకు సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పూజల హరికృష్ణ ఆదేశాల మేరకు ఆత్మ కమిటీ చైర్మన్ పూజల గోపికృష్ణ నేతృత్వంలో గురువారం నాయకులు, కార్యకర్తలు హైదరాబాద్‌కు పయనమయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ సమగ్రతకు, ప్రజాస్వామ్య పరిరక్షణకు భారత రాజ్యాంగమే మూలాధారమని పేర్కొన్నారు. పూజల హరికృష్ణ దిశానిర్దేశంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా ఈ ర్యాలీలో భాగస్వాములవుతున్నారని తెలిపారు. రాజ్యాంగ స్ఫూర్తిని, విలువలను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని, రాజ్యాంగ పరిరక్షణ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ మహా ర్యాలీ ప్రధాన ఉద్దేశమని అన్నారు. తరలివెళ్లిన వారిలో సీనియర్ నాయకులు బొమ్మల యాదగిరి, కలీముద్దీన్ అహ్మద్, గుర్రం అంజిరెడ్డి, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు రషీద్, ఏఎంసీ వైస్ చైర్మన్ పవన్, సురేందర్ రెడ్డి, మైనారిటీ టౌన్ ప్రెసిడెంట్ అతిఫ్, మేరుగు రాజు, ఆత్మ కమిటీ డైరెక్టర్ జనార్దన్ రెడ్డి, చోటా అజ్మత్, ఏఎంసీ డైరెక్టర్లు ప్రభాకర్, వినోద్, రవీందర్ రెడ్డి, రంగు అశోక్ గౌడ్, ఇమ్రాన్, రాజేశ్వర్, రిక్కల మహేందర్ రెడ్డి, దుర్గయ్య, కనకయ్య, లహరి, పవన్, నాగరాజు,



శ్రవణ్ తదితరులు ఉన్నారు.

వేలాడుతున్న విద్యుత్ తీగలు.. పొంచి ఉన్న ప్రమాదం

- **అధికారుల నిర్లక్ష్యంపై కైరీ గ్రామస్తులు, రైతుల ఆందోళన**



ఎడ్లబండ్లు, వాహనాలకు తప్పని ముప్పు..



ఉద్యమ కెరటం, కెరమెరి: మండలంలోని కైరీ గ్రామపంచాయతీ పరిధిలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా కిందికి వేలాడుతుండటంతో గ్రామస్తులు, రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని ప్రధాన సిమెంట్ రోడ్లతో పాటు వ్యవసాయ పొలాలకు వెళ్లే మార్గాల్లో విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామంలోని పలు వీధుల్లో విద్యుత్ తీగలు చేతికి అందేంత తక్కువ ఎత్తులో వేలాడుతున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు ఒకవైపునకు ఒరిగి ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. గాలి వీచినప్పుడు తీగలు ఒకదానికొకటి తగిలి నిప్పురవ్వలు వస్తున్నాయని చెబుతున్నారు. వ్యవసాయ పనుల నిమిత్తం ఎడ్లబండ్లపై నిలబడి వెళ్లే రైతులకు వేలాడుతున్న విద్యుత్ తీగలు ప్రాణాపాయంగా మారుతున్నాయి. గ్రామంలోకి సరుకులు, పంట ఉత్పత్తులను తరలించే బొలెరో మ్యాక్స్ ట్రక్కులు, ట్రాక్టర్లు వంటి ఎత్తైన వాహనాలు వెళ్లే సమయంలో తీగలు తగిలి విద్యుదాఘాతం జరిగే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా పొలాల పక్కన ఉన్న కంచెలపైకి విద్యుత్ తీగలు వేలాడుతుండటంతో వ్యవసాయ కూలీలు, పశువుల కాపరులు భయాందోళనలు చెందుతున్నారు. చెట్ల కొమ్మల మధ్య నుంచి విద్యుత్ తీగలు వెళ్తుండటంతో గాలులు, వర్షాల సమయంలో షార్ట్ సర్క్యూట్ ప్రమాదం జరిగే అవకాశం ఉందని వాపోతున్నారు. ఈ సమస్యపై పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించినప్పటికీ సరైన స్పందన లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవించకముందే అధికారులు స్పందించాలని కోరుతున్నారు. ప్రమాదకరంగా ఒరిగిన విద్యుత్ స్తంభాలను సరిచేసి, కిందికి వేలాడుతున్న తీగలను సరైన ఎత్తులో బిగించాలని, అవసరమైన మరమ్మతులు చేపట్టి గ్రామస్తులు, రైతులు, వాహన దారుల భద్రతకు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



ఉద్యమ కెరటం, భూంపల్లి: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని భూంపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గురువారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, గ్రామ సర్పంచ్ జన్నారెడ్డి, ఉప సర్పంచ్ అనూష నందు, అక్బర్‌పేట్ సర్పంచ్ మండల్ కుమార్, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, గ్రామస్తులందరూ కలిసి భారత రాజ్యాంగ విలువల పరిరక్షణకై ప్రతిజ్ఞ చేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాధ్యతలను ప్రతిఒక్కరూ గౌరవించాలని, అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యాదగిరి, ఏఎన్ఎం కవిత, అంగన్‌వాడీ టీచర్ భూలక్ష్మి, రేషన్ డీలర్ నర్సింహులు, భూపాల్, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

తప్పులు దొర్లకుండా వివరాలు నమోదు చేయాలి



ఉద్యమ కెరటం, నేరడిగొండ(ఇచ్చోడ): మండలంలోని సాత్ నంబర్ గ్రామంలో ఇందిరమ్మ జీవిత భీమా పథకం నమోదు ప్రక్రియను గురువారం గ్రామ సర్పంచ్ రమేష్ రాథోడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా నమోదు కార్యక్రమం జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ జీవిత భీమా పథకం నమోదు ప్రక్రియను పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని సూచించారు. అర్హులైన ప్రతిఒక్కరికీ పథకం ప్రయోజనం అందేలా చూడాలని, వివరాలు నమోదు చేసే సమయంలో ఎలాంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. లబ్ధిదారుల వ్యక్తిగత వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, సరైన సమాచారాన్ని నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలకు అందేలా ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పేర్కొన్నారు.

గొర్రెలు, మేకలకు మశూచి నివారణ టీకాలు



ఉద్యమ కెరటం, నేరడిగొండ: మండలంలోని కుమారి గ్రామంలో గొర్రెలు, మేకలకు మశూచి వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ అగ్గిమల్ల గోదావరి లస్మన్న హాజరై ప్రారంభించారు. పశుసంవర్ధక శాఖ సిబ్బంది గ్రామంలోని గొర్రెలు, మేకలకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి జీవన్ రాథోడ్ పశువులకు సోకే వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. పశువులకు వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, పశుపోషకులు ప్రభుత్వ టీకాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సిద్దిపేటలో ఐఆర్‌సీటీసీ సమావేశం

ఉద్యమ కెరటం, సిద్దిపేట: ఐఆర్‌సీటీసీ టూరిజం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పర్యాటక ప్యాకేజీల వివరాలను వెల్లడించేందుకు శుక్రవారం ఉదయం 11.30 గంటలకు సిద్దిపేట రైల్వే స్టేషన్‌లోని వీఐపీ లాంజ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే జోన్, సికింద్రాబాద్ అసిస్టెంట్ మేనేజర్ (టూరిజం) పివి.వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు యాత్రలు, దేశీయ విమాన పర్యాటక ప్యాకేజీలు, ప్రత్యేక రైల్ టూర్ ప్యాకేజీలకు సంబంధించిన వివరాలను వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు. యాత్ర మార్గాలు, ప్యాకేజీల ధరలు, ప్రయాణికులకు కల్పించే సౌకర్యాల గురించి వివరించనున్నట్లు తెలిపారు.

కుమార్తెను హత్య చేసిన తండ్రి అరెస్ట్

- హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించి, హడావుడిగా మృతదేహం దహనం
- వివరాలు వెల్లడించిన ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయికొట్టే



ఉద్యమ కెరటం, ఆదిలాబాద్ (ఉట్నూర్): నిశ్చితార్థానికి రెండు రోజుల ముందు కుమార్తెను దిండుతో ఊపిరాడకుండా చేసి హత్య చేసిన తండ్రిని నార్నూర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఉట్నూర్ ఎఎస్పీ రుత్విక్ సాయి కొట్టే గురువారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. వివరాల్లోకి వెళితే.. ఉట్నూర్ సబ్ డివిజన్ పరిధిలోని నార్నూర్ పోలీస్ స్టేషన్ పరిధి ఉమ్రి గ్రామానికి చెందిన అడే కళ్యాణి ఈనెల 24న ఉరివేసుకుని మృతిచెందినట్లు తొలుత సమాచారం అందింది. అయితే బంధువులు వచ్చే వరకు కూడా వేచి చూడకుండా తండ్రి అడే కైలాష్ అదేరోజు ఉదయం మృతదేహాన్ని హడావుడిగా దహనం చేయడంతో అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ ఘటనపై గ్రామపంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు నార్నూర్ పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. కళ్యాణికి వివాహం నిశ్చయమై మరో రెండు రోజుల్లో నిశ్చితార్థం జరగాల్సి ఉండగా, ఆమె మరో వ్యక్తిని ప్రేమిస్తున్న విషయం తండ్రి కైలాష్‌కు తెలిసింది. దీంతో కుటుంబ పరువు పోతుందనే ఆగ్రహంతో కుమార్తెను హత్య చేయాలని నిర్ణయించుకున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ క్రమంలో ఈనెల 24వ తేదీ తెల్లవారుజామున కళ్యాణి ముఖంపై దిండుతో గట్టిగా అదిమి ఊపిరాడకుండా చేసి హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం చున్నీతో ఇంటి పైకప్పు దూలానికి ఉరివేసి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నించినట్లు విచారణలో తేలింది. నేరాన్ని కప్పిపుచ్చేందుకు మృతదేహాన్ని బంధువులు వచ్చేలోపే హడావుడిగా దహనం చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో నిందితుడు అడే కైలాష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ తెలిపారు. కేసుకు సంబంధించి మరిన్ని ఆధారాలు సేకరించేందుకు దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నార్నూర్ సీఐ డి.గురుస్వామి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



ఉద్యమ కెరటం, తాండూర్: మండలంలోని బోయపల్లి ప్రభుత్వ పాఠశాలలో గురువారం భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బోయపల్లి సర్పంచ్ సుందిళ్ల శంకరమ్మ భూమయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత రాజ్యాంగం దేశ ప్రజలందరికీ సమాన హక్కులు, స్వేచ్ఛ, న్యాయం, సమానత్వం కల్పించే గొప్ప మార్గదర్శకమని పేర్కొన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేద్కర్ చేసిన కృషి, త్యాగాలను ప్రతిఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. రాజ్యాంగంలోని విలువలు, ఆశయాలను విద్యార్థులు చిన్ననాటి నుంచే అలవర్చుకుని బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణ, ఐక్యత, పరస్పర గౌరవం, దేశభక్తి వంటి విలువలను పాటిస్తూ ఉన్నత విద్యను అభ్యసించాలని, భవిష్యత్తులో దేశ అభివృద్ధికి తమవంతు కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు రాజ్యాంగ దినోత్సవ ప్రాముఖ్యతను వివరించి, భారత రాజ్యాంగ పీఠికను సామూహికంగా చదివారు. రాజ్యాంగ ఆశయాలు, విలువలను గౌరవిస్తూ వాటిని ఆచరణలో పాటిస్తామని విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జీవిత బీమాతో పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా



ఉద్యమ కెరటం, మద్దూర్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని మద్దూర్ మండలంలోని కేలూర్ గ్రామంలో సర్పంచ్ లక్ష్మణ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు, అర్హులైన లబ్ధిదారులకు పథకం ప్రయోజనాలు, అర్హతలు, నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు రూ.5లక్షల జీవిత బీమా పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కుటుంబానికి ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న వ్యక్తికి అనుకోని మరణం సంభవించినప్పుడు ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా బీమా పరిహారం అండగా నిలుస్తుందని వివరించారు. ఈ పథకం ద్వారా అర్హత కలిగిన కుటుంబాల్లో 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన ఒక సంపాదించే వ్యక్తికి జీవిత బీమా రక్షణ కల్పించనున్నట్లు తెలిపారు. బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుందని, బీమా పొందిన వ్యక్తి మరణించిన సందర్భంలో నమోదు చేసిన నామినీకి పరిహారం అందుతుందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబం ఈ పథకంలో నమోదు చేసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ధరస్వర్ సాయిలు, ఐకేపీ జగదీష్, కొండా గంగాధర్, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీని సందర్శించిన ట్రైనీ ఐపిఎస్ అధికారులు



ఉద్యమ కెరటం, ఆదిలాబాద్: ఆదిలాబాద్ మున్సిపాలిటీని 14 మంది ట్రైనీ ఐఏఎస్ అధికారులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలోని వివిధ విభాగాల పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మున్సిపల్ అధికారులు, సిబ్బందితో మాట్లాడి పట్టణ పారిశుద్ధ్య నిర్వహణ, పరిపాలన విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారానికి చేపడుతున్న చర్యలపై అవగాహన పొందారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో అమలవుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, పట్టణ ప్రజలకు అందిస్తున్న సేవలు, పరిపాలన విధానాలను ట్రైనీ ఐఏఎస్ అధికారులకు వివరించారు. పట్టణ అభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణ, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనలో మున్సిపాలిటీ చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. వివిధ విభాగాల పనితీరును పరిశీలించిన ట్రైనీ ఐఏఎస్ అధికారులు క్షేత్రస్థాయి పరిపాలనపై అవగాహన పెంచుకున్నారు. భవిష్యత్తులో ఉన్నత పరిపాలన బాధ్యతలు చేపట్టనున్న ట్రైనీ ఐఏఎస్ అధికారులకు ఈ పర్యటన ప్రత్యక్ష క్షేత్రస్థాయి అనుభవాన్ని అందించింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, వివిధ విభాగాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- డొంగ్లీ పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ

ఉద్యమ కెరటం, కామారెడ్డి: ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అన్నారు. గురువారం డొంగ్లీ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలు, వైద్య సిబ్బంది పనితీరు, నిర్వహిస్తున్న రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ విధుల పట్ల వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఆసుపత్రిలో వైద్య సేవల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా రోగులకు సకాలంలో వైద్యం అందించాలని ఆదేశించారు. ముఖ్యంగా గర్భిణీలకు అందిస్తున్న వైద్య సేవలు, ఆరోగ్య పరీక్షలు, మాతా శిశు సంరక్షణకు సంబంధించిన వివరాలను వైద్య సిబ్బంది ద్వారా అడిగి తెలుసుకున్నారు. గర్భిణీలకు ఎప్పటికప్పుడు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించాలని, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ ఆకస్మిక తనిఖీలో శ్రీలేఖ, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి అండగా నిలిచిన ఆడే గజేందర్‌బాధిత కుటుంబానికి అండగా నిలిచిన ఆడే గజేందర్



- సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.3లక్షల ఎల్ఓసీ అందజేత

ఉద్యమ కెరటం, బోథ్: ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ ఆర్జీపీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. బోథ్ మండల కేంద్రానికి చెందిన ఆడెపు రాజు కుమార్తె సమాదర్శిని మెరుగైన వైద్య చికిత్స కోసం ఆయన ప్రత్యేక చొరవ తీసుకున్నారు. జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.3లక్షల విలువైన ఎల్ఓసీ మంజూరు చేయించారు. మంజూరైన ఎల్ఓసీ పత్రాలను గురువారం హైదరాబాద్‌లో ఆడే గజేందర్ స్వయంగా బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. సకాలంలో స్పందించి రూ.3లక్షల ఆర్థిక భరోసా కల్పించిన ఆడే గజేందర్‌కు ఆడెపు రాజు కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కుర్మే మహేందర్, బోథ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మెరుగు భోజన్న, మురళి గౌడ్, ఎండీ సద్దాం తదితరులు పాల్గొన్నారు.

సంవిధాన్ ర్యాలీలో ఆడే గజేందర్



ఉద్యమ కెరటం, బోథ్: భారత రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణే లక్ష్యంగా హైదరాబాద్‌లో గురువారం నిర్వహించిన సంవిధాన్ రక్షక్ ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ పాల్గొన్నారు. అఖిల ఏఐసీసీ పిలుపు మేరకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ భారీ పాదయాత్ర నగరంలోని లిబర్టీ సర్కిల్ వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం నుంచి నెక్లెస్ రోడ్‌లోని ఇందిరా గాంధీ విగ్రహం వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో ఆడే గజేందర్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజాస్వామ్య పరిరక్షణతో పాటు భారత రాజ్యాంగం అందించిన హక్కులు, విలువల ప్రాధాన్యతను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ ర్యాలీ ప్రధాన ఉద్దేశమని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కుర్మే మహేందర్, బోథ్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మెరుగు భోజన్న, నాయకులు మురళి గౌడ్, యండి సద్దాం, మౌలానా తదితరులు పాల్గొన్నారు.

జలసిరి పనులను త్వరగా పూర్తి చేయాలి

డీఎల్‌పీఓ ఫణిందర్ రావు



ఉద్యమ కెరటం, నేరడిగొండ: నేరడిగొండ మండలంలోని సావర్గాం, బుగ్గారం(బి) గ్రామ పంచాయతీలను డీఎల్‌పీఓ ఫణిందర్ రావు గురువారం సందర్శించి జలసిరి పథకం కింద చేపడుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యక్తిగత ఇంకుడు గుంతలు, సామూహిక ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీఛార్జ్ నిర్మాణాలు, గ్రామ సంస్థ భవనాల్లో కమ్యూనిటీ శానిటేషన్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను పరిశీలించారు. పలు పనులకు సంబంధించి మార్కౌట్ కార్యక్రమాల్లో కూడా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిర్దేశిత గడువులోగా పనులను నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని, పనుల్లో జాప్యం చేయకుండా వీలైనంత త్వరగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ జీవన్ రెడ్డి, సర్పంచులు జాదవ్ కళ్యాణి, మహేందర్, జాదవ్ కృష్ణ, సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలి



ఉద్యమ కెరటం, తాండూర్: యాసంగిలో వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అధిక నీటి అవసరమయ్యే వరి పంటకు బదులుగా ఆరుతడి పంటల సాగుకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలని వ్యవసాయ అధికారి సుష్మా అన్నారు. గురువారం మండలంలోని చంద్రపల్లి గ్రామ శివారులో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు యాసంగి పంటల సాగుపై క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి పంట కోత అనంతరం పొలాల్లో మిగిలిపోయే కొయ్యలు, పంట అవశేషాలను కాల్చవద్దని రైతులకు సూచించారు. పంట అవశేషాలను కాల్చడం ద్వారా భూమిలోని మిత్ర సూక్ష్మజీవులు నశించడంతో పాటు భూసారం తగ్గుతుందని, పర్యావరణ కాలుష్యం పెరుగుతుందని వివరించారు. పంట అవశేషాలను కాల్చకుండా భూమిలో కలియదున్నడం ద్వారా అవి సేంద్రియ ఎరువుగా మారి నేల సారాన్ని పెంచుతాయని, తదుపరి పంటకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ సూచనలు పాటిస్తూ పర్యావరణహిత పద్ధతుల్లో సాగు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రాకేష్, రైతులు పాల్గొన్నారు.

జిల్లాలో 424 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్



ఉద్యమ కెరటం, సిద్దిపేట: ఖరీఫ్ 2026–27 సీజన్‌కు సంబంధించి సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా 424 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతుల నుంచి ధాన్యం సేకరణ చేపడుతున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎఫ్ఏక్యూల ప్రమాణాలకు అనుగుణంగా కనీస మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు వివరించారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా గన్నీ సంచులు, అవసరమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులు, గోదాములకు తరలించేందుకు అవసరమైన లారీలను కూడా సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోళ్లలో దళారులు, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా రైతుల నుంచే సేకరణ జరిగేలా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏడు రకాల సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. రైతులు తమ ధాన్యాన్ని సమీపంలోని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని సూచించారు.



గాయత్రి జోడీ శుభారంభం

లక్నో: సయ్యద్ మోదీ ఇండియా ఇంటర్నేషనల్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్లు శుభారంభం చేశారు. మహిళల డబుల్స్ లో డిఫెండింగ్ చాంపియన్ పుల్లెల గాయత్రి - ట్రీసా జాలీ తొలి రౌండ్‌లో 21-8, 21-7తో రష్మి గణేశ్-అమృత ప్రముతేశ్ ను ఓడించింది. సింగిల్స్‌లో ఉన్నతి హుడా, అష్మిత చాలిహా, తన్వీ శర్మ, తన్య హేమంత్ కూడా రెండో రౌండ్‌కు చేరారు. మూడో సీడ్ ఉన్నతి 21-15, 21-19తో కాంటెమిర్ (ఉక్రెయిన్)పై , ఐదో సీడ్ అష్మిత 21-14, 21-16తో పోలినా బుహ్రోవా (ఉక్రెయిన్) పై గెలిచారు. పురుషుల సింగిల్స్ లో తుషార్ సువీర్ 21-11, 21-17తో ఐదో సీడ్ జస్టిన్ హో (మలేసియా) పై నెగ్గగా, తెలంగాణ షట్లర్ తరుణ్ 22-23, 11-21తో హువాంగ్ (ఇంగ్లండ్) చేతిలో ఓడిపోయాడు.



రామచందర్ రావు మృతి పట్ల ఎమ్మెల్యే సంతాపం

ఉద్యమ కెరటం, దుబ్బాక: బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు భోంపల్లి మనోహర్ రావు మామయ్య సురభి రామచందర్ రావు మృతి పట్ల దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామచందర్ రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రామచందర్ రావు మృతి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు.

ప్రయాణికుల సౌకర్యమే ప్రధాన లక్ష్యం

సత్తుపల్లి , ఖమ్మం మధ్య ప్రతి 20 నిమిషాలకు డీలక్స్ బస్సు

ఉద్యమ కెరటం, సత్తుపల్లి: ప్రయాణికుల సౌకర్యార్థం సత్తుపల్లి- ఖమ్మం, ఖమ్మం-సత్తుపల్లి మార్గంలో ప్రతి 20 నిమిషాలకు ఒక డీలక్స్ బస్సును ఏర్పాటు చేసినట్లు సత్తుపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు ఎక్స్ప్రెస్ బస్సు చార్జీతోనే డీలక్స్ బస్సుల్లో ప్రయాణించవచ్చని పేర్కొన్నారు. అదేవిధంగా డీలక్స్ బస్సుల్లోనూ మంత్లీ సీజన్ టికెట్ల సౌకర్యాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. 20 రోజుల చార్జీ చెల్లించి 30 రోజుల పాటు ప్రయాణించే అవకాశం కల్పించామని వివరించారు. రెండు నెలల సీజన్ టికెట్ తీసుకున్న వారికి అదనంగా ఐదు రోజులు, మూడు నెలల సీజన్ టికెట్ తీసుకున్న వారికి అదనంగా పది రోజులు ప్రయాణించే వెసులుబాటు కల్పించినట్లు చెప్పారు. ముఖ్యంగా మహిళలకు 15 రోజుల చార్జీతో 30 రోజులు ప్రయాణించే విధంగా సీజన్ టికెట్ ధరలను సవరించినట్లు తెలిపారు. ఏదైనా సీజన్ టికెట్ కలిగిన ప్రయాణికులు ఆదివారాల్లో సిటీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని పేర్కొన్నారు. సీజన్ టికెట్ ఉన్నవారు రూట్‌తో సంబంధం లేకుండా సూపర్ లగ్జరీ బస్సుల్లో బేసిక్ ఫేర్‌పై 10శాతం రాయితీతో ప్రయాణించే అవకాశం కూడా కల్పించినట్లు వివరించారు. సత్తుపల్లి-ఖమ్మం మధ్య రాకపోకలు సాగించే ప్రయాణికులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ముంబై ఇండియన్స్ ప్రతిపాదనకు రాజస్థాన్ నిరాకరణ

హార్దిక్ కోసం జైస్వాల్, ఆర్చర్‌ను అడిగిన ముంబై!

- ఇద్దరు కీలక ఆటగాళ్లను వదులుకునేందుకు విముఖత
- మధ్యలోనే నిలిచిపోయిన హార్దిక్ బదిలీ చర్చలు



ముంబై, నవంబర్ 26 (ఉద్యమ కెరటం): ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ట్రేడ్ వ్యవహారం మరోసారి ఆసక్తికరంగా మారింది. ముంబై ఇండియన్స్ నుంచి పంజాబ్ కింగ్స్‌కు మారిన హార్దిక్ కోసం అంతకుముందు రాజస్థాన్ రాయల్స్ కూడా తీవ్రంగా ప్రయత్నించినట్లు తాజాగా ఓ నివేదిక వెల్లడించింది. అయితే ముంబై ఇండియన్స్ పెట్టిన డిమాండ్లకు రాజస్థాన్ అంగీకరించకపోవడంతో ఈ డీల్ మధ్యలోనే ఆగిపోయినట్లు తెలుస్తోంది. 2027 ఐపీఎల్ రిటెన్షన్ గడువుకు ముందు హార్దిక్ పాండ్యా భవిష్యత్తుపై ఎన్నో ఊహాగానాలు వినిపించాయి. చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ వంటి ఫ్రాంచైజీల పేర్లు తెరపైకి వచ్చాయి. చివరకు పంజాబ్ కింగ్స్ అతడిని సొంతం చేసుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా పంజాబ్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ ముంబై ఇండియన్స్‌కు వెళ్లాడు. అయితే హార్దిక్ కోసం రాజస్థాన్ చేసిన ప్రయత్నం ఎందుకు విఫలమైందనే డీటెయిల్స్ తాజాగా వెలుగులోకి వచ్చాయి. ఓ జాతీయ మీడియా కథనం ప్రకారం.. పాండ్యాను ఇచ్చేందుకు రాజస్థాన్ ముందు ముంబై భారీ ప్రతిపాదన ఉంచిందట. యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌తో పాటు ఇంగ్లండ్ స్టార్ పేసర్ జోఫ్రా ఆర్చర్‌ను కూడా ట్రేడ్‌లో భాగంగా ఇవ్వాలని ముంబై కోరినట్లు సమాచారం. అయితే ఈ ఇద్దరు కీలక ఆటగాళ్లను వదులుకోవడానికి రాజస్థాన్ యాజమాన్యం ఇష్టపడలేదు. దీంతో ఈ చర్చలను మరింత ముందుకు తీసుకెళ్లలేదట. హార్దిక్ పాండ్యాను దక్కించుకోలేకపోయినప్పటికీ రాజస్థాన్ రాయల్స్ మరో కీలక ట్రేడ్ డీల్‌ను పూర్తి చేసింది. ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ సామ్ కరన్‌ను లక్నో సూపర్ జెయింట్స్‌కు పంపించి.. ప్రతిగా భారత సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ, స్పిన్నర్ మనీమారన్ సిద్ధార్థ్‌ను జట్టులోకి తీసుకుంది. ఈ ఒప్పందంలో షమీని లక్నో గతంలో రూ.10 కోట్లకు కొనుగోలు చేయగా.. రాజస్థాన్‌కు మారే సమయంలో అతడి ధరను రూ.8 కోట్లుగా నిర్ణయించినట్లు సమాచారం. లెఫ్టార్మ్ స్పిన్నర్ ఎం. సిద్ధార్థ్ తన ప్రస్తుత ధర రూ.75 లక్షలకే రాజస్థాన్‌కు మారనున్నాడు. మరోవైపు సామ్ కరన్ రూ.2.4 కోట్ల ప్రస్తుత ధరతో లక్నో సూపర్ జెయింట్స్‌కు వెళ్లనున్నాడు.మహమ్మద్ షమీ రాకతో రాజస్థాన్ రాయల్స్ పేస్ బౌలింగ్ విభాగం మరింత బలోపేతం కానుంది. ఇప్పటికే జోఫ్రా ఆర్చర్ వంటి ప్రపంచస్థాయి బౌలర్ జట్టులో ఉండటంతో.. కొత్త బంతితో వీరిద్దరూ ప్రత్యర్థి బ్యాటర్లకు సవాళ్లు విసిరే అవకాశం ఉంది. 2024 సీజన్‌లో రాజస్థాన్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా ఆర్చర్ నిలిచాడు. మరోవైపు షమీకి ఐపీఎల్‌లో మంచి అనుభవం ఉంది. ఇప్పటివరకు 132 మ్యాచ్‌లు ఆడి 145 వికెట్లు పడగొట్టాడు. కొత్త బంతితో వికెట్లు తీయగల సామర్థ్యం, అంతర్జాతీయ అనుభవం రాజస్థాన్‌కు ఉపయోగపడనున్నాయి. ఇప్పుడు షమీ, ఆర్చర్ జోడీ ఎలా రాణిస్తుందన్నది ఐపీఎల్ 2027లో ఆసక్తికరంగా మారనుంది.

రెండో టెస్టులోనూ గూర్నూర్?

శుక్రవారం నుంచి భారత్--న్యూజిలాండ్ రెండో టెస్టు

- క్రైస్ట్‌చర్చ్ వేదికగా కీలక పోరు
- భారత తుది జట్టులో మార్పులకు అవకాశం
- ప్రసిధ్ కృష్ణ, అన్షుల్ కంబోజ్‌లలో ఒకరిపై వేటు?
- గూర్నూర్ బౌలింగ్‌పై మోర్నీ మోర్కెల్ ప్రశంసలు

క్రైస్ట్‌చర్చ్, నవంబర్ 26 (ఉద్యమ కెరటం): రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా శుక్రవారం నుంచి న్యూజిలాండ్, భారత్ మధ్య రెండో టెస్టు ఆరంభం కానుంది. ఈ టెస్టుకు టీమిండియా తుది జట్టులో మార్పులు చోటుచేసుకునే అవకాశాలు ఉన్నాయి. యువ ఫాస్ట్ బౌలర్ గూర్నూర్ బ్రార్‌కు టెస్టు అరంగేట్రం చేసే ఛాన్సెస్ మెండుగా ఉన్నట్లు తెలుస్తోంది. భారత బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ చేసిన వ్యాఖ్యలు ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూరుస్తున్నాయి. క్రైస్ట్‌చర్చ్‌లోని హ్యాగ్లీ ఓవల్ పిచ్ పరిస్థితులకు గూర్నూర్ బౌలింగ్ సరిగ్గా సరిపోతుందని ఆయన అభిప్రాయపడ్డాడు. ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో గూర్నూర్ బ్రార్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. భారత జట్టు తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచి అందరి దృష్టిని ఆకర్షించాడు. అతడి వేగం, బౌన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రెండో టెస్టుకు ముందు మీడియాతో మాట్లాడిన మోర్నీ మోర్కెల్.. 'భారత జట్టులోకి వచ్చినప్పటి నుంచి గూర్నూర్ గురించి ఎంతో ఆసక్తి నెలకొంది. అతడి వేగం, బౌన్స్ చాలా బాగున్నాయి. ఇక్కడి పరిస్థితులకు అతడు చక్కగా సరిపోతాడని భావిస్తున్నాను. ఏం జరుగుతుందో చూద్దాం' అని చెప్పాడు. గూర్నూర్ జట్టులోకి వస్తే.. అన్షుల్ కంబోజ్ లేదా ప్రసిధ్ కృష్ణలలో ఒకరిపై వేటు పడనుంది. గూర్నూర్ బ్రార్ టెస్టు జట్టులో చోటు కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నాడని మోర్కెల్ తెలిపాడు. 'గూర్నూర్ టెస్టు జట్టులోకి వచ్చేందుకు తనవంతు ప్రయత్నం చేస్తున్నాడు. అన్ని విషయాల్లోనూ సరైన మార్గంలోనే వెళ్తున్నాడు. అయితే ఆటగాడిగా తుది జట్టు ఎంపిక మన చేతుల్లో ఉండదు. అవకాశం వచ్చినప్పుడు దాన్ని సద్వినియోగం చేసుకునేలా సిద్ధంగా ఉండాలి. అరంగేట్రానికి దగ్గరగా ఉన్నప్పుడు కొంతమంది బౌలర్లు ఒత్తిడికి గురవుతారు. అతడికి అవకాశం ఎప్పుడు వస్తుందో చెప్పలేం. కానీ ఆ సమయానికి అతడు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండేలా చూడటం నా బాధ్యత' అని వివరించాడు. రెండో టెస్టు జరగనున్న హ్యాగ్లీ ఓవల్ పిచ్‌పై కూడా మోర్కెల్ స్పందించాడు. మైదానంలో పిచ్‌పై ఎక్కువ మొత్తంలో పచ్చిక కనిపిస్తోందని, అయితే అది మ్యాచ్‌లో ఎలా స్పందిస్తుందో చూడాలని తెలిపాడు. 'నేను చూసినంతవరకు పిచ్‌పై ఎక్కువ పచ్చిక ఉంది. గత మ్యాచ్‌కు ముందు కూడా పిచ్‌పై మంచి బౌన్స్, వేగం ఉంటాయని భావించాం. కానీ మ్యాచ్‌లో పరిస్థితులు అలా లేవు. కాబట్టి పిచ్ ఎలా ఉంటుందో మనం ఇప్పుడే చెప్పలేం. బ్యాటింగ్, బౌలింగ్‌లో ఎదురయ్యే పరిస్థితులకు తగ్గట్టుగా ఆడటమే ముఖ్యం' అని పేర్కొన్నాడు. యువ పేసర్ అన్షుల్ కంబోజ్ ప్రదర్శనపైనా మోర్కెల్ స్పందించాడు. గత ఏడాది ఇంగ్లండ్ పర్యటనలో ఓల్డ్ ట్రాఫోర్డ్ వేదికగా టెస్టు అరంగేట్రం చేసిన కంబోజ్.. తొలి మ్యాచ్‌లో 18 ఓవర్లు బౌలింగ్ చేసి 89 పరుగులిచ్చి ఒక వికెట్ తీసుకున్నాడు. వెల్లింగ్టన్‌లో జరిగిన తొలి టెస్టులో కొత్త బంతితో వికెట్ సాధించడంతో పాటు నైట్‌వాచ్‌మన్‌గా 38 పరుగులు చేసి ఆకట్టుకున్నాడు. అయితే తొలి టెస్టు ప్రదర్శన ఆధారంగా కంబోజ్‌ను అంచనా వేయకూడదని మోర్కెల్ సూచించాడు. 'అది కేవలం అన్షుల్ విషయంలోనే కాదు. న్యూజిలాండ్ బౌలర్లు కూడా ఆ పిచ్‌పై తక్కువ వేగంతో బౌలింగ్ చేశారు. ఒక ఆటగాడిని అతడి తొలి టెస్టుతోనే అంచనా వేయడం సరికాదు. తొలి మ్యాచ్ ఆడేటప్పుడు ఆటగాళ్లలో ఎన్నో భావోద్వేగాలు ఉంటాయి. జట్టు కోసం కఠిన ఓవర్లు వేస్తున్న అతడికి మనం మద్దతుగా నిలవాలి. రెండు మూడు మ్యాచ్‌లు ఆడిన తర్వాత అతడి ప్రదర్శనపై చర్చించవచ్చు. ఇప్పుడే ఒక అభిప్రాయానికి రావడం తొందరపాటు అవుతుంది' అని స్పష్టం చేశాడు. రెండో టెస్ట్‌కు భారత తుది జట్టు (అంచనా)లో యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, దేవదత్ పడిక్కల్, శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రిషభ్ పంత్ (కీపర్), ధ్రువ్ జురెల్, వాషింగ్టన్ సుందర్, జస్ప్రీత్ బుమ్రా, ఆకాష్ దీప్, అన్షుల్ కాంబోజ్, ప్రసిధ్ కృష్ణ లేదా గుర్నూర్ బ్రార్ ఉన్నారు.



ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక



సారా అర్జున్‌కు బాలీవుడ్‌లో బంపర్ ఆఫర్!

రామ్‌చరణ్ చిత్రంలోనూ సారాకు అవకాశం?

ముంబై, నవంబర్ 26 (ఉద్యమ కెరటం): 'ధురంధర్' చిత్రాలతో దేశవ్యాప్తంగా గుర్తింపు సంపాదించుకున్న యువ నటి సారా అర్జున్‌కు బాలీవుడ్‌లో మరో భారీ అవకాశం దక్కినట్లు ప్రచారం జరుగుతోంది. కథానాయికగా తొలి అడుగులోనే భారీ విజయాన్ని అందుకున్న సారా తదుపరి చిత్రాల ఎంపికలో ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు సమాచారం. 'ధురంధర్ 2' విడుదలై ఎనిమిది నెలలు గడుస్తున్నప్పటికీ ఆమె కొత్త చిత్రానికి సంబంధించి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. తాజాగా ప్రముఖ నిర్మాణ సంస్థ యశ్‌రాజ్ ఫిల్మ్స్ రూపొందించనున్న సంగీత ప్రధాన ప్రేమకథా చిత్రంలో సారాను కథానాయికగా ఎంపిక చేసినట్లు బాలీవుడ్ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి. 'సైయారా' చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న ఈ సంస్థ మరో ప్రేమకథను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సిద్ధమవుతోందట. ఇందులో అంబరీష్ వర్మ కథానాయకుడిగా నటించనున్నట్లు సమాచారం. మనీష్ శర్మ దర్శకత్వం వహించనున్న ఈ చిత్రానికి ప్రస్తుతం నిర్మాణ పూర్వ పనులు జరుగుతున్నాయని, వచ్చే ఏడాది జనవరిలో చిత్రీకరణ ప్రారంభించే అవకాశముందని తెలుస్తోంది. మరోవైపు ప్రముఖ నటి మధుబాల జీవితకథ ఆధారంగా తెరకెక్కనున్న చిత్రంలోనూ సారా పేరు వినిపిస్తోంది. తెలుగులో 'యుఫోరియా' చిత్రంలో నటించిన ఆమెకు రామ్‌చరణ్ తదుపరి చిత్రం 'ఆర్సీ17'లో కథానాయికగా అవకాశం దక్కే సూచనలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ పాత్ర కోసం సారా అర్జున్, సాత్విక వీరవల్లా పేర్లను చిత్రబృందం పరిశీలిస్తున్నట్లు సమాచారం. అయితే ఈ చిత్రాల్లో సారా ఎంపికకు సంబంధించి అధికారిక ప్రకటనలు వెలువడాల్సి ఉంది.

బన్నీ 25వ చిత్రానికి దర్శకుడెవరు?

తదుపరి చిత్రాలపై అల్లు అర్జున్ భారీ ప్రణాళికలు

హైదరాబాద్, నవంబర్ 26 (ఉద్యమ కెరటం): 'పుష్ప 2' చిత్రంతో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన తదుపరి చిత్రాల విషయంలో భారీ ప్రణాళికలతో ముందుకు సాగుతున్నారు. ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'రాకా' చిత్రంతో తన స్థాయిని మరింత పెంచుకోవాలని భావిస్తున్నారు. చిత్ర నిర్మాణానికి ఎంత సమయం పట్టినా నాణ్యత విషయంలో రాజీపడకూడదనే లక్ష్యంతో ఉన్నట్లు సమాచారం. ఇప్పటివరకు విడుదల తేదీని ప్రకటించకపోవడంతో ఈ చిత్రం 2027లో ప్రేక్షకుల ముందుకు వస్తుందా? లేక 2028 వరకు వేచి చూడాల్సిందేనా? అనే ఉత్కంఠ అభిమానుల్లో నెలకొంది. 'రాకా' చిత్రంతో తీరిక లేకుండా ఉన్నప్పటికీ తదుపరి చిత్రాలపైనా బన్నీ దృష్టి సారించారు. ఇప్పటికే ప్రముఖ దర్శకుడు లోకేశ్ కనగరాజ్‌తో సినిమా చేసేందుకు అంగీకరించినట్లు సమాచారం. మరోవైపు 'సరైనోడు' చిత్రంతో భారీ విజయాన్ని అందించిన బోయపాటి శ్రీనుతో మరోసారి జతకట్టేందుకు సిద్ధమవుతున్నట్లు సినీవర్గాల్లో ప్రచారం జరుగుతోంది. బోయపాటి చెప్పిన కథను ఇప్పటికే విన్నారని, చిత్రాన్ని ఖరారు చేయడమే మిగిలిందని తెలుస్తోంది. మలయాళ నటుడు, దర్శకుడు బాసిల్ జోసెఫ్ కూడా అల్లు అర్జున్ తదుపరి చిత్రాల దర్శకుల జాబితాలో ఉన్నట్లు సమాచారం. అన్నీ అనుకున్నట్లు జరిగితే వచ్చే ఏడాది వీరిద్దరి కలయికలో సినిమా ప్రారంభమయ్యే అవకాశముందట. మరోవైపు ఓ బాలీవుడ్ దర్శకుడితోనూ బన్నీ సంప్రదింపులు జరుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. తన సినీ ప్రస్థానంలో మైలురాయిగా నిలిచే 25వ చిత్రాన్ని అల్లు అర్జున్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆ చిత్రానికి దర్శకత్వం వహించే అవకాశం ఎవరికి దక్కుతుందనేది సినీవర్గాల్లో ఆసక్తికరంగా మారింది. 'రాకా' అనంతరం లోకేశ్ కనగరాజ్, బోయపాటి శ్రీను, బాసిల్ జోసెఫ్‌లలో ఎవరితో ముందుగా సినిమా చేస్తారన్నది అధికారిక ప్రకటనతోనే తేలనుంది.



పాక్ కంటెంట్‌కు భారత్‌లో కత్తెర!

- నెట్‌ఫ్లిక్స్‌కు కేంద్ర సమాచార, ప్రసార శాఖ కీలక ఆదేశాలు
- పాకిస్థాన్ సినిమాలు, వెబ్ సిరీస్‌లను నిలిపివేయాలని సూచన
- జాతీయ భద్రత దృష్ట్యా గత మార్గదర్శకాలను పాటించాలని స్పష్టీకరణ
- పాకిస్థానీ వెబ్ సిరీస్ విడుదల నేపథ్యంలో వివాదం
- బెంగళూరులో పాక్ డ్రామా ప్రత్యేక ప్రదర్శనలు రద్దు



న్యూఢిల్లీ, నవంబర్ 26 (ఉద్యమ కెరటం): భారత్‌లో పాకిస్థాన్‌కు చెందిన సినిమాలు, వెబ్ సిరీస్‌లు, ఇతర డిజిటల్ వినోద కార్యక్రమాలు అందుబాటులో లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్‌ను కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆదేశించినట్లు సమాచారం. నెట్‌ఫ్లిక్స్ నిర్మించిన తొలి పాకిస్థానీ ఒరిజినల్ వెబ్ సిరీస్ 'జో బచే హై సంగ్ సమేట్ లో' డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో ఈ వ్యవహారం తెరపైకి వచ్చింది. సదరు సిరీస్‌ను భారత్‌లోనూ విడుదల చేసే అవకాశాలున్నాయంటూ పలు ఫిర్యాదులు, వినతిపత్రాలు అందడంతో కేంద్రం స్పందించినట్లు తెలుస్తోంది. 2025 ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. జాతీయ భద్రతా కారణాల దృష్ట్యా అదే ఏడాది మే 8న కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. భారత్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఓటీటీ సంస్థలు, డిజిటల్ ప్రసార వేదికలు పాకిస్థాన్ మూలాలున్న వినోద కార్యక్రమాలను నిలిపివేయాలని సూచించింది. సమాచార సాంకేతిక నిబంధనలు--2021 ప్రకారం దేశ సార్వభౌమాధికారం, సమగ్రత, జాతీయ భద్రత, విదేశీ సంబంధాలు, ప్రజాశాంతికి విఘాతం కలిగించే ప్రసారాల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని పేర్కొంది. భారతీయ ప్రేక్షకులకు పాకిస్థాన్ సినిమాలు, సిరీస్‌లు అందుబాటులో ఉంచబోమని 2025 జూన్‌లో నెట్‌ఫ్లిక్స్ లిఖితపూర్వకంగా హామీ ఇచ్చినట్లు సమాచారం. ఆ హామీకి కట్టుబడి ఉండాలని కేంద్రం తాజాగా స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. మరోవైపు బెంగళూరులో పాకిస్థానీ టీవీ డ్రామా 'దార్-ఏ-నిజాత్' ప్రత్యేక ప్రదర్శనల వ్యవహారం వివాదాస్పదమైంది. నవంబర్ 28న ఫ్రేజర్ టౌన్‌లోని ఓ రెస్టారెంట్‌లో, డిసెంబర్ 5న జయమహల్ ఎక్స్‌టెన్షన్‌లోని ప్రైవేటు థియేటర్‌లో ఈ ప్రదర్శనలను నిర్వహించేందుకు రెండు వేర్వేరు సంస్థలు ఏర్పాట్లు చేశాయి. కార్యక్రమాలకు హాజరయ్యేవారు పాకిస్థానీ సంప్రదాయ దుస్తులు ధరించి రావాలని ఆహ్వాన పత్రికల్లో పేర్కొనడంపై సామాజిక మాధ్యమాల్లో పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. బెంగళూరు పోలీసులకు ఫిర్యాదులు చేశారు. ఈ కార్యక్రమాల నిర్వహణకు పోలీసుల నుంచి ముందస్తు అనుమతులు తీసుకోలేదని బెంగళూరు పోలీస్ కమిషనర్ ఆర్.హితేంద్ర వెల్లడించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశాలపై పోలీసులు నిర్వాహకులను సంప్రదించి వివరాలు సేకరించారు. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తమైన వ్యతిరేకత, పోలీసుల విచారణ నేపథ్యంలో రెండు ప్రదర్శనలను రద్దు చేస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. కుటుంబ సభ్యులు, సన్నిహితుల కోసం ఏర్పాటు చేసుకున్న కార్యక్రమం వివాదాస్పదం కావడంతో రద్దు చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రెండు ప్రదర్శనల రద్దును పులకేశినగర్ పోలీసులు ధ్రువీకరించారు.

'నంది' అవార్డులకు గ్రీన్ సిగ్నల్!



అమరావతి, నవంబర్ 26 (ఉద్యమ కెరటం): తెలుగు సినీ, టెలివిజన్, నాటక రంగాల కళాకారుల సుదీర్ఘ నిరీక్షణకు ఎట్టకేలకు తెరపడింది. ప్రతిష్ఠాత్మక 'నంది' అవార్డుల ప్రదానంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. అమరావతి నుంచి తాజాగా వెలువడిన ఉత్తర్వులతో టాలీవుడ్‌తో పాటు బుల్లితెర, రంగస్థల కళాకారుల్లో సరికొత్త ఉత్సాహం నెలకొంది. గత కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న నంది పురస్కారాల విషయంలో ప్రభుత్వం వేగం పెంచి, ఏకంగా 2017 నుంచి 2025 వరకు అంటే తొమ్మిదేళ్ల కాలానికి సంబంధించిన అవార్డులను ఒకేసారి అందించేందుకు రంగం సిద్ధమైంది. సినిమా, టెలివిజన్, నాటక రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసే ప్రక్రియను వేగవంతం చేస్తూ ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. కేవలం ప్రకటనతోనే సరిపెట్టకుండా, వచ్చే నెల అంటే డిసెంబర్‌లోనే నంది అవార్డుల ప్రదానోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు ముమ్మరం చేస్తోంది. ఈ ప్రతిష్ఠాత్మక వేడుకను విజయవాడలో గానీ, లేదా రాజధాని అమరావతిలో గానీ అట్టహాసంగా నిర్వహించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. దాదాపు తొమ్మిదేళ్ల తర్వాత నంది అవార్డుల సందడి మళ్ళీ మొదలవుతుండటంతో, 2017 నుంచి 2025 మధ్య వచ్చిన ఏయే చిత్రాలు, ఏయే నటీనటులు, సాంకేతిక నిపుణులు ఈ గౌరవాన్ని దక్కించుకుంటారనే ఆసక్తి ఇప్పుడు సినీ వర్గాల్లో జోరుగా చర్చనీయాంశమైంది. మొత్తానికి, డిసెంబర్‌లో తెలుగు కళాకారులందరికీ ఇదొక నిజమైన పండగ కాబోతోంది.

'రామాయణ' చిత్రబృందంపై అమిత్‌షా ప్రశంసలు!



న్యూఢిల్లీ, నవంబర్ 26 (ఉద్యమ కెరటం): భారతీయ ఇతిహాసం ఆధారంగా తెరకెక్కిన భారీ పౌరాణిక చిత్రం 'రామాయణ' చిత్రబృందంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రశంసలు కురిపించినట్లు సమాచారం. గురువారం న్యూఢిల్లీలో అమిత్ షాతో కథానాయకుడు రణబీర్ కపూర్, కథానాయిక సాయిపల్లవి, దర్శకుడు నితేశ్ తివారీ, నిర్మాత నమిత్ మల్హోత్రా, సహ నిర్మాత నీరజ్ సంఘూయ్ సమావేశమయ్యారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే రామాయణ ఇతిహాసాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో వెండితెరపై ఆవిష్కరించినందుకు చిత్రబృందాన్ని అమిత్ షా అభినందించినట్లు తెలుస్తోంది. రణబీర్ కపూర్, సాయిపల్లవి, యశ్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రం దీపావళి కానుకగా నవంబర్ 5న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అద్భుతమైన దృశ్య ప్రభావాలు, భారీ నిర్మాణ విలువలు, ఆకట్టుకునే కథనంతో దేశవిదేశాల్లో ప్రేక్షకుల ఆదరణ పొందుతోంది. ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా రూ.1,755 కోట్లకు పైగా స్థూల వసూళ్లు సాధించినట్లు సినీ వాణిజ్య వర్గాలు వెల్లడిస్తున్నాయి. రూ.1,742 కోట్ల వసూళ్లతో రికార్డు సృష్టించిన 'పుష్ప 2'ను ఈ చిత్రం అధిగమించినట్లు ప్రచారం జరుగుతోంది. భారీ వసూళ్లతోపాటు అంతర్జాతీయ పురస్కారాల వేదికపైనా 'రామాయణ' సత్తా చాటుతున్నట్లు సమాచారం. 2027 ఆస్కార్ పురస్కారాలకు సంబంధించి ఉత్తమ దృశ్య ప్రభావాల విభాగంలో పరిశీలనకు ఎంపికైన 20 చిత్రాల జాబితాలో 'రామాయణ'కు చోటు దక్కినట్లు తెలుస్తోంది. భారతీయ పౌరాణిక చిత్రాలకు అంతర్జాతీయ స్థాయిలో మరింత ఆదరణ పెరిగేందుకు ఈ విజయం దోహదపడుతుందనే అభిప్రాయాలు సినీవర్గాల్లో వ్యక్తమవుతున్నాయి.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. PRGI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**

ఉద్యమ కెరటం
నిజం రక్షణే రక్షితం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక

రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ నేతల పిలుపు

'సంవిధాన్ రక్షా మార్చ్'లో జిల్లా కాంగ్రెస్ నాయకులు



ఉద్యమ కెరటం, ఆదిలాబాద్: ఏఐసీసీ పిలుపు మేరకు 'ఓట్ బచావో– దేశ్ బచావో అభియాన్'లో భాగంగా రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'సంవిధాన్ రక్షా మార్చ్'లో ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర ఇన్‌చార్జి బిఎం.సందీప్ కుమార్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ట్యాంక్‌బండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించి, నెక్లెస్ రోడ్డులోని ఇందిరా గాంధీ విగ్రహం వరకు నిర్వహించిన పాదయాత్రలో ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, గండ్రత్ సుజాత, సాజిద్ ఖాన్, మల్లెపూల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, ఓటు హక్కును పరిరక్షించుకోవడం ప్రతిఒక్కరి బాధ్యతని అన్నారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్ చేపట్టిన ఉద్యమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

గ్రామగ్రామాన జ్యోతిబాపూలే వర్ధంతి నిర్వహించాలి



ఉద్యమ కెరటం, కౌటాల: మహాత్మా జ్యోతిబాపూలే 136వ వర్ధంతి కార్యక్రమాలను ఈనెల 28న రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామంలో ఘనంగా నిర్వహించాలని మాలి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆడే వసంత్ రావు పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అణగారిన వర్గాల అభ్యున్నతి, కుల వివక్ష నిర్మూలన, విద్యా వ్యాప్తి కోసం మహాత్మా జ్యోతిబాపూలే చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ముఖ్యంగా మహిళా విద్య, సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. జ్యోతిబాపూలే ఆశయాలైన సామాజిక న్యాయం, సమానత్వం, విద్యా చైతన్యాన్ని ప్రతిఒక్కరూ ఆచరణలో పెట్టాలని సూచించారు. ప్రతి గ్రామంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించాలని, జీవిత చరిత్ర, సామాజిక ఉద్యమాలపై చర్చా కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కోరారు. ఈ వర్ధంతి కార్యక్రమాల్లో మాలి కులసంఘాలతో పాటు కుల మతాలకు అతీతంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, సామాజిక ఉద్యమకారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నిరుపేద మహిళకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు

మంజూరు పత్రం అందజేసిన కలెక్టర్ గరిమ అగ్రవాల్



ఉద్యమ కెరటం, సిరిసిల్ల: సొంత ఇల్లు లేక అద్దె ఇంట్లో ఉంటూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద మహిళకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అండగా నిలిచారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మర్రిపల్లి అమృతకు ఇల్లు మంజూరు చేస్తూ గురువారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంజూరు పత్రాన్ని అందజేశారు. చందుర్తి మండలం కిష్టంపేట గ్రామానికి చెందిన మర్రిపల్లి అమృత బతుకుదెరువు కోసం సుమారు 20ఏళ్ల క్రితం నిజామాబాద్ జిల్లాకు వెళ్లారు. నాలుగేళ్ల క్రితం తన కుమారుడి అనారోగ్య సమస్యల నేపథ్యంలో వేములవాడకు వచ్చారు. సొంత ఇల్లు లేకపోవడంతో అద్దె ఇంట్లో ఉంటూ అద్దె చెల్లించలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అమృత పరిస్థితిని తెలుసుకున్న కలెక్టర్ వెంటనే అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించారు. ఈ మేరకు మంజూరు పత్రాన్ని స్వయంగా అందజేసి నిరుపేద కుటుంబానికి భరోసా కల్పించారు. వేములవాడ పట్టణంలోని 12వ వార్డులో తనకు 60 గజాల స్థలం ఉందని, అక్కడ ఇంటి నిర్మాణం చేపడతామని అమృత తెలిపారు. తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రత్యేక చొరవ చూపిన కలెక్టర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి హౌసింగ్ పీడీ సాజిద్, వేములవాడ మున్సిపల్ కమిషనర్ లోకేష్ తదితరులు పాల్గొన్నారు..

విద్యుత్ షాక్ తో వ్యక్తి మృతి



ఉద్యమ కెరటం, నేరడిగొండ: మండలంలోని పీచర గ్రామానికి చెందిన బైరి నర్సయ్య (31) గురువారం విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్నిబోథ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని, కేసుపై దర్యాప్తు కొనసాగుతోందని ఎస్సై సయ్యద్ ఇమ్రాన్ వివరించారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట నిరసన



ఉద్యమ కెరటం, ఆదిలాబాద్: సంయుక్త కిసాన్ మోర్చా దేశవ్యాప్త పిలుపులో భాగంగా రైతులు, వ్యవసాయ కూలీల ప్రధాన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వివిధ రైతు సంఘాల ఆధ్వర్యంలో గురువారం జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు అందజేసి, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా రైతు సంఘాల నాయకులు మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తుల సాగు ఖర్చులకు అదనంగా 50 శాతం కలిపి కనీస మద్దతు ధర నిర్ణయించాలని, ఎంఎస్‌పీకి చట్టబద్ధమైన హామీ కల్పించాలని డిమాండ్ చేశారు. రైతుల రుణాలను రీషెడ్యూల్ చేయడం, మారటోరియం విధించడం కాకుండా పూర్తిగా రద్దు చేసి సమగ్ర రుణమాఫీ పథకాన్ని అమలు చేయాలని కోరారు. విద్యుత్ ప్రైవేటీకరణను నిలిపివేసి, 2025 విద్యుత్ బిల్లును ఉపసంహరించుకోవాలని, ప్రతి ఇంటికి 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. 60 ఏళ్లు పైబడిన రైతులకు నెలకు రూ.10వేల పెన్షన్‌తో పాటు బీమా సౌకర్యం కల్పించాలని, ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు రూ.25లక్షల పరిహారం అందించి ఆదుకోవాలన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కూలీలకు ఏడాదికి 200 రోజుల పని కల్పించి, రోజువారీ వేతనాన్ని రూ.700కు పెంచాలని డిమాండ్ చేశారు. ఎల్ నినో ప్రభావంతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడంతో పాటు కరువు సహాయక చర్యలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని కోరారు. రైతులు, వ్యవసాయ కూలీల సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుక దేవిదాస్, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.సాయన్న, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాల రామన్న తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్ మెయింటెనర్ల కాన్ఫరెన్స్ పోస్టర్ ఆవిష్కరణ

ఉద్యమ కెరటం, తాండూర్: రేచిని రోడ్ రైల్వే స్టేషన్ పరిధిలో గురువారం దక్షిణ మధ్య రైల్వే కార్మిక సంఘ్ బెల్లంపల్లి సెక్షన్ ఆధ్వర్యంలో ట్రాక్ మెయింటెనర్ల కాన్ఫరెన్స్ వాల్ పోస్టర్‌ను భారతీయ మజ్దూర్ సంఘ్ నాయకుడు తాళ్లపల్లి రాములు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి బెల్లంపల్లి సెక్షన్ అధ్యక్షుడు మేడి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా తాళ్లపల్లి రాములు మాట్లాడుతూ రైళ్ల సురక్షిత ప్రయాణంలో ట్రాక్ మెయింటెనర్ల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ఎండ, వాన, చలి అనే తేడా లేకుండా విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి సంఘం కృషి చేస్తుందని తెలిపారు. కార్మికులకు భద్రత పరికరాలు, న్యాయమైన విధి నిర్వహణ విధానాలు కల్పించాలని కోరారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు ప్రతిఒక్కరూ సంఘటితంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈనెల 29న సికింద్రాబాద్‌లోని లాలాగూడ రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో ట్రాక్ మెయింటెనర్ల కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు వివరించారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు ఓపెన్ సెషన్ ఉంటుందని తెలిపారు. ఈ సమావేశానికి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, భారతీయ రైల్వే మజ్దూర్ సంఘ్ ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్ పటేల్ గౌరవ అతిథులుగా హాజరుకానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి సెక్షన్ కార్యదర్శి నక్క కృష్ణ, ఫిలిప్స్ ఆంటోనీ, సిరంగి శ్రీనివాస్, పొన్నాడ రాజేష్, వడ్నాల శ్రీకాంత్, లీలా



సాగర్, సురేందర్ కుమార్ యాదవ్, పింటూ కుమార్, రాజ్ కుమార్, శిభు మెహతో, జి.స్వామి తదితరులు పాల్గొన్నారు.

కౌటాలలో ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



ఉద్యమ కెరటం, కౌటాల: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంవిధాన్ రక్షా మార్చ్ కార్యక్రమంలో భాగంగా గురువారం కౌటాల మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజ్యాంగ ప్రతులను చేతబూని రాజ్యాంగ పరిరక్షణకు మద్దతుగా నినాదాలు చేస్తూ అంబేద్కర్ విగ్రహం ఎదుట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భారత రాజ్యాంగం దేశ ప్రజలందరికీ సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం, సోదరభావం వంటి విలువలను అందించిందని పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించుకోవడంతో పాటు రాజ్యాంగ ఆశయాలను ప్రతిఒక్కరూ గౌరవించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ సిడం గణపతి, డీసీఎంఎస్ జిల్లా వైస్ చైర్మన్ కుమురం మంతయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్ధల దేవయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నీకోడే గంగారాం, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం జానకిరావు, యాదవ సంఘం మండల అధ్యక్షుడు గట్టయ్య, కాంగ్రెస్ నాయకులు దుర్గం యశ్వంత్ రావు, దుర్గం బండు, ధోని రవి, దుర్గం వెంకటేష్, దండ్రే బాలాజీ, జాడి రాంకుమార్, దుర్గం కిషోర్, దొంగ్రీ రవి, సుధాకర్, ఎల్లన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు ప్రజల భాగస్వామ్యం అవసరం

- **వంద రోజుల ప్రచార పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ ఆశిష్ సంగవాన్**

ఉద్యమ కెరటం, కామారెడ్డి: సమాజంలో బాల్య వివాహాలను పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగవాన్ పిలుపునిచ్చారు. బాల్య వివాహాల నివారణ లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన వంద రోజుల ప్రత్యేక ప్రచార కార్యక్రమంలో భాగంగా రూపొందించిన వాల్ పోస్టర్‌ను గురువారం కలెక్టరేట్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాలు చిన్నారుల భవిష్యత్తు, విద్యాభివృద్ధి, ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. బాల్య వివాహాల నివారణకు ప్రభుత్వ శాఖలతో పాటు స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించి వాటిని అడ్డుకోవాలని కోరారు. ముఖ్యంగా ఆపదలో ఉన్న పిల్లలకు అండగా నిలిచేందుకు అందుబాటులో ఉన్న చైల్డ్ హెల్ప్‌లైన్ టోల్ ఫ్రీ నంబర్ 1098పై గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులకు సూచించారు. బాలలపై వేధింపులు, అన్యాయాలు జరిగినప్పుడు 1098కు సమాచారం అందించి వారి రక్షణకు సహకరించాలని తెలిపారు. బాల్య వివాహాల రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని, బాలల హక్కులను పరిరక్షిస్తూ వారికి సురక్షితమైన బాల్యాన్ని అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో



అదనపు కలెక్టర్లు విక్టర్ (రెవెన్యూ), గిరి (స్థానిక సంస్థలు), జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి వెంకటేష్, కార్యాలయ సూపరింటెండెంట్ అరుణ్ భాస్కర్, జిల్లా బాలల సంరక్షణ అధికారి ప్రవంతి, సాధన ఎన్జీవో కోఆర్డినేటర్ గిరిజ, సీఎస్ఎం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులను సహించేది లేదు

జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

ఉద్యమ కెరటం, ఖమ్మం: పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులను ఏమాత్రం సహించేది లేదని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ స్పష్టం చేశారు. వేధింపులకు గురైన మహిళలు భయపడకుండా ధైర్యంగా ఫిర్యాదు చేసి తమ ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలని సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన పోష్ చట్టం 2013 అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పని ప్రదేశాల్లో మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులు అనేక సందర్భాల్లో బయటకు రావడం లేదని, ఫిర్యాదు చేస్తే ఇబ్బందులు ఎదురవుతాయనే భయంతో బాధితులు మౌనంగా ఉంటున్నారని తెలిపారు. మహిళలు వేధింపులను మౌనంగా భరించకుండా ధైర్యంగా ముందుకు రావాలని అన్నారు. పోష్ చట్టం ప్రకారం పది మంది, అంతకంటే ఎక్కువ మంది ఉద్యోగులు పనిచేసే ప్రతి సంస్థలో అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేయడం తప్పనిసరి అని పేర్కొన్నారు. మహిళలకు సురక్షితమైన పని వాతావరణం కల్పించడం ప్రతి సంస్థ బాధ్యత అని స్పష్టం చేశారు. వేధింపులకు గురైన మహిళలు వెంటనే ఫిర్యాదు చేయాలని, ఎలాంటి ఒత్తిళ్లకు, రాజీ ప్రయత్నాలకు తలొగ్గకుండా చట్టపరమైన పరిష్కారం పొందాలని సూచించారు. ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహిస్తే నిందితులు తప్పించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. మహిళల ఆత్మగౌరవం కంటే ఉద్యోగం, డబ్బు, హోదా ముఖ్యమైనవి కావని స్పష్టం చేశారు. పోష్ చట్టం ప్రధాన ఉద్దేశం పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడమేనని తెలిపారు.



అదే సమయంలో చట్టాన్ని దుర్వినియోగం చేయకుండా, ఫిర్యాదులపై వాస్తవాల ఆధారంగా న్యాయబద్ధమైన విచారణ జరగాలని పేర్కొన్నారు. మహిళల భద్రత, హక్కుల పరిరక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, వేధింపులకు గురైన మహిళలకు మహిళా సాధికారత కేంద్రాల ద్వారా అవసరమైన సహాయ సహకారాలు అందించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ప్రమిళ, సీడీపీఓ విష్ణువందన, డీహెచ్ఈడబ్ల్యూ సమ్రిన్, సంబంధిత అధికారులు, మహిళలు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక

ప్రభుత్వ నిధులు వృథా

- నిరుపయోగంగా కంపోస్ట్ షెడ్, వైకుంఠధామం
- నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుతున్న నిర్మాణాలు.. పట్టించుకోని అధికారులు





ఉద్యమ కెరటం, కెరమెరి: గ్రామాల అభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణ కోసం ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన అభివృద్ధి పనులు అధికారుల పర్యవేక్షణ లోపంతో నిరుపయోగంగా మారుతున్నాయి. కెరమెరి మండలం ఖైరీ గ్రామపంచాయతీ పరిధిలో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్, వైకుంఠధామం నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ప్రజాధనంతో నిర్మించిన ఈ కట్టడాలు ప్రజలకు ఉపయోగపడక పోవడంపై గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధ్వానంగా కంపోస్ట్ షెడ్, వైకుంఠదామం..

గ్రామంలోని తడి, పొడి చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువుగా తయారు చేసేందుకు నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్ ప్రస్తుతం నిర్వహణకు నోచుకోవడం లేదు. షెడ్ చుట్టూ పిచ్చిమొక్కలు, ఎండుగడ్డి పెరిగి అధ్వానంగా మారింది. లోపల ప్లాస్టిక్, ఆహార వ్యర్థాలు, ఇనుప వస్తువులను వేరు చేసేందుకు ఏర్పాటు చేసిన తొట్టెల్లో ఖాళీ మద్యం సీసాలు కనిపిస్తున్నాయి. ప్రహరీ గోడకు పగుళ్లు ఏర్పడగా, పక్కనే ఉన్న గదికి తలుపులు లేక గడ్డితో నిండిపోయింది. అలాగే గ్రామంలో నిర్మించిన వైకుంఠధామం పరిస్థితి కూడా దయనీయంగా మారింది. స్మశానవాటిక ప్రధాన ద్వారం వద్ద ఉన్న గేటు తుప్పుపట్టి వంగిపోయింది. పిల్లర్ల పైభాగంలో ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. లోపల ఏర్పాటు చేసిన నీటి తొట్టె చెత్తాచెదారం, ఎండుటాకులతో నిండిపోయి వినియోగానికి పనికిరాకుండా పోయింది. కనీస నిర్వహణ లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వ నిధులతో నిర్మించిన అభివృద్ధి పనులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురాకుండా వదిలేయడంపై గ్రామస్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. లక్షలాది రూపాయల ప్రజాధనం వెచ్చించినప్పటికీ వాటి నిర్వహణపై అధికారులు దృష్టి సారించకపోవడం పట్ల ఆవేదన చెందుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు, ఎంపీడీఓ తక్షణమే స్పందించి ఖైరీ గ్రామపంచాయతీ పరిధిలోని కంపోస్ట్ షెడ్, వైకుంఠధామాన్ని పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని, పరిసరాలను శుభ్రపరిచి పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.









పుట్టినరోజు వేడుకల్లో అనాథ వృద్ధులకు అన్నదానం

ఉద్యమ కెరటం, గంభీరావుపేట: పుట్టినరోజు వేడుకలను ఆర్భాటాలకు పరిమితం చేయకుండా సేవా కార్యక్రమంతో ఆదర్శంగా నిలిచారు గంభీరావుపేట మండలం నర్మాల బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఆకునూరి రాజేందర్. తన పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి గంభీరావుపేట మండల కేంద్రంలోని మా అనాథ వృద్ధాశ్రమాన్ని సందర్శించి వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి, వారితో ఆప్యాయంగా ముచ్చటిస్తూ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వృద్ధులతో కలిసి కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు మల్లుగారి నర్సాగౌడ్ మాట్లాడుతూ పుట్టినరోజుల పేరుతో అనవసర ఆర్భాటాలకు ఖర్చు చేయడం కంటే అనాథలు, నిరాశ్రయ వృద్ధుల ఆకలి తీర్చడం ఎంతో గొప్ప విషయమని అన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవత్వం, సేవాభావాన్ని పెంపొందించడంతో పాటు ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఆకునూరి రాజేందర్ మాట్లాడుతూ తన పుట్టినరోజు సందర్భంగా వృద్ధులకు అన్నదానం చేయడం, వారితో కొంత సమయం గడపడం ఎంతో ఆత్మసంతృప్తిని ఇచ్చిందని తెలిపారు. ప్రతిఒక్కరూ తమ పుట్టినరోజు, ఇతర శుభకార్యాల సందర్భంగా చేసే ఖర్చులో కొంత భాగాన్ని నిరుపేదలు, అనాథలు, వృద్ధుల సంక్షేమానికి కేటాయించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నర్మాల మాజీ సర్పంచ్ ఎడబోయిన రాజు, నాయకులు



ఎగదండి స్వామి, బొంగు మల్లేశం యాదవ్, పంపరి మహేష్, గుండెల్లి కళ్యాణ్, దాసరి చంద్రం తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

- సంవిధాన్ రక్షా మార్చ్‌లో డాక్టర్ మట్టా దయానంద విజయకుమార్

ఉద్యమ కెరటం, సత్తుపల్లి: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'సంవిధాన్ రక్షా మార్చ్' కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద విజయకుమార్ పాల్గొన్నారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో ర్యాలీగా హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఖమ్మం పట్టణంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం కాంగ్రెస్ శ్రేణులు హైదరాబాద్‌కు బయల్దేరాయి. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం



నుంచి ఇందిరా గాంధీ విగ్రహం వరకు నిర్వహించిన సంవిధాన్ రక్షా మార్చ్‌లో డాక్టర్ మట్టా దయానంద విజయకుమార్‌తో పాటు సత్తుపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, సమానత్వం, పౌరుల హక్కుల పరిరక్షణకు సంఘీభావం ప్రకటించారు. అనంతరం డాక్టర్ మట్టా దయానంద విజయకుమార్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం దేశ ప్రజలకు కల్పించిన హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం వంటి విలువలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని భావితరాలకు అందించేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి మాజీ మున్సిపల్ చైర్మన్ గడ్డం ఇందు ప్రియతో పాటు సత్తుపల్లి నియోజకవర్గంలోని ఐదు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, ఏఎంసీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, వివిధ స్థాయిల ప్రజాప్రతినిధులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు, ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ సహకరించాలి

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు మర్రిపల్లి చందన, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

ఉద్యమ కెరటం, సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు మర్రిపల్లి చందన, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో పూజారులు, పాస్టర్లు, ఖాజీలకు బాల్య వివాహాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల నివారణకు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మర్రిపల్లి చందన మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యతని, బాల్య వివాహాల నిర్మూలనలో మత పెద్దలు కీలకపాత్ర పోషించాలని అన్నారు. పిల్లలందరికీ విద్య అందేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ 18 ఏళ్లలోపు బాలికలకు, 21 ఏళ్లలోపు బాలురకు వివాహాలు చేయకూడదని స్పష్టం చేశారు. బాల్య వివాహాలకు



పాల్పడితే చట్టప్రకారం జైలు శిక్ష, జరిమానా ఉంటాయని తెలిపారు. గత ఏడాది కాలంలో జిల్లాలో 12 బాల్య వివాహాలను అధికారులు అడ్డుకున్నారని వివరించారు. పిల్లలను బాగా చదివించి ఉన్నత స్థానాలకు ఎదిగేలా ప్రోత్సహించాలని కోరారు. అనంతరం ఎస్పీ మహేష్ బి.గితె మాట్లాడుతూ ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, వివిధ మతాలకు చెందిన ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





మూడోసారి డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి నెలరోజుల జైలు

జిల్లా ఎస్పీ ఎం.రాజేష్ చంద్ర

ఉద్యమ కెరటం, కామారెడ్డి: మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ ఎం.రాజేష్ చంద్ర అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజల ప్రాణాల రక్షణే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 84 మందిని పోలీసులు కోర్టులో హాజరుపర్చగా, వారికి మొత్తం రూ.1లక్ష 66వేల 100 జరిమానా విధించినట్లు చెప్పారు. మరో ఆరుగురికి ఒకరోజు సామాజిక సేవ చేయాలని న్యాయస్థానం ఆదేశించింది. గతంలో రెండుసార్లు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడినప్పటికీ, ప్రవర్తన మార్చుకోకుండా మూడోసారి కూడా అదే తప్పుకు పాల్పడిన వ్యక్తికి కోర్టు నెలరోజుల జైలు శిక్ష విధించినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మద్యం మత్తులో వాహనాలు నడపడం ద్వారా వాహనదారులతో పాటు రహదారిపై ప్రయాణించే అమాయకుల ప్రాణాలకు కూడా ప్రమాదం పొంచి ఉంటుందని తెలిపారు. క్షణిక నిర్లక్ష్యం ఎన్నో కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపుతుందని పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనం నడిపితే జరిమానాలతో పాటు జైలు శిక్షలు కూడా తప్పవని స్పష్టం చేశారు. మద్యం సేవించినప్పుడు వాహనం నడపకుండా ప్రత్యామ్నాయ ప్రయాణ మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ సురక్షిత ప్రయాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

మేనూర్ లో అంబేద్కర్ కు ఘన నివాళులు



ఉద్యమ కెరటం, మద్నూర్: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలంలోని మేనూర్ గ్రామంలో గురువారం బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి యాదవ్ సూర్య వంశీ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ దేశానికి చేసిన సేవలను, భారత రాజ్యాంగ నిర్మాణంలో ఆయన పోషించిన కీలకపాత్రను స్మరించుకున్నారు. రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు, స్వేచ్ఛ, న్యాయం కల్పించే గొప్ప పునాది అని పేర్కొన్నారు. అనంతరం యాదవ్ సూర్య వంశీ మాట్లాడుతూ నవంబర్ 26 భారతదేశ చరిత్రలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన రోజని, 1949 నవంబర్ 26న భారత రాజ్యాంగాన్ని రాజ్యాంగ పరిషత్ ఆమోదించిందని తెలిపారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతిఒక్కరూ విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని, కులమతాలకు అతీతంగా సమానత్వం, సోదరభావంతో జీవించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రూ.1,500 కోట్లతో వర్గల్ లో వింటేజ్ కాఫీ ప్లాంట్

తొలి దశ యూనిట్ కు భూమి పూజ చేసిన మంత్రి శ్రీధర్ బాబు

వెయ్యి మందికి ఉపాధి.. 2027 నాటికి 11వేల టన్నుల ఉత్పత్తి



ఉద్యమ కెరటం, వర్గల్: సిద్దిపేట జిల్లా వర్గల్‌లోని స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌లో వింటేజ్ కాఫీ అండ్ బెవరేజెస్ లిమిటెడ్ సుమారు రూ.1,500 కోట్లతో ఫ్రీజ్-డ్రైడ్ ఇన్‌స్టంట్ కాఫీ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది. ఏటా 5,500 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో కూడిన తొలి దశ యూనిట్‌కు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రాన్ని గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దుతున్నామని, పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. దక్షిణాసియాలోనే తొలిసారిగా అత్యంత అధునాతన రోటో టెక్నాలజీతో నిర్మిస్తున్న ఈ ప్లాంట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా వెయ్యి మందికి ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. 2027 చివరి నాటికి 11వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యానికి చేరుకోనున్న ఈ యూనిట్ నుంచి అమెరికా, యూరప్, ఆస్ట్రేలియా తదితర దేశాలకు మేడ్ ఇన్ తెలంగాణ కాఫీ ఎగుమతి కానుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, సంస్థ ఎండీ తాటి బాలకృష్ణ పాల్గొన్నారు.

జై సంవిధాన్ ర్యాలీలో పాల్గొన్న పూజల హరికృష్ణ



ఉద్యమ కెరటం, సిద్దిపేట: హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన 'జై విధాన్ – జై సంవిధాన్' రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీలో సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పూజల హరికృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చేతిలో భారత రాజ్యాంగ పుస్తకాన్ని పట్టుకుని రాజ్యాంగ పరిరక్షణకు తన సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ ర్యాలీలో రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి, కర్ణాటక ఏఐసీసీ ఇంచార్జి అజ్మాతుల్లా తదితర నాయకులతో కలిసి పూజల హరికృష్ణ పాల్గొన్నారు. అనంతరం మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుతో కలిసి తెలంగాణ రాష్ట్ర ఏఐసీసీ ఇంచార్జి ఎస్.ఎం. సందీప్ కుమార్‌కు భారత రాజ్యాంగ పుస్తకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భారత రాజ్యాంగం దేశ ప్రజలకు కల్పించిన హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం వంటి విలువలను కాపాడుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని భావితరాలకు అందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఉద్యమ కెరటం
నిజం రక్షణ రక్షిత
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక



> బీసీల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలవాల్సిన సామాజిక భవనాలు ఇప్పుడు కొత్త వివాదానికి కేంద్రబిందువుగా మారుతున్నాయి. ఏళ్ల తరబడి బీసీ కుల సంఘాలు పోరాడి సాధించుకున్న ఆత్మగౌరవ భవనాల నిర్మాణం, నిర్వహణ విషయంలో తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో నం.14 బీసీ సంఘాల్లో తీవ్ర చర్చకు దారితీస్తోంది. భవనాల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించడం స్వాగతించదగిన పరిణామమే అయినప్పటికీ, వాటి నిర్వహణలో సంబంధిత కుల సంఘాలకే పూర్తి ప్రాధాన్యత ఉండాలన్నది బీసీ నాయకుల ప్రధాన వాదన. భవనాలు తమ పేరుతో నిర్మించి, నిర్వహణ అధికారాలను ప్రభుత్వ ప్రతినిధుల చేతుల్లో పెడితే బీసీల ఆత్మగౌరవానికి అర్థం ఏమిటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.
>
> - ఉద్యమ కెరటం, మంచిర్యాల బ్యూరో

భవనాలు బీసీలవి.. పెత్తనం ప్రభుత్వానిదా?

జీవో నం.14తో బీసీ సంఘాల్లో కలకలం

ఆత్మగౌరవ భవనాల నిర్వహణపై కొత్త వివాదం

స్వయం ప్రతిపత్తికి భంగం కలుగుతుందంటున్న బీసీ నేతలు

ఆత్మగౌరవం అంటే కేవలం భవనాల నిర్మాణమేనా?

బీసీ కులాల సామాజిక, విద్యా, ఆర్థిక అభివృద్ధికి ఆత్మగౌరవ భవనాలు కీలక వేదికలుగా నిలవాల్సి ఉంది. విద్యార్థులకు మార్గదర్శనం, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలపై అవగాహన, పోటీ పరీక్షలకు శిక్షణ, గ్రంథాలయాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, సామాజిక సమావేశాలు నిర్వహించేందుకు ఇవి ఉపయోగపడాలి. తరతరాలుగా సామాజికంగా వెనుకబడిన వర్గాలకు ఐక్యత, చైతన్యం కల్పించే కేంద్రాలుగా ఎదగాలి. అయితే ఈ భవనాల నిర్వహణలోనే సంఘాలకు తగిన స్వేచ్ఛ లేకపోతే వాటి అసలు లక్ష్యం నెరవేరుతుందా అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

ప్రభుత్వం నిధులిస్తోంది.. సంఘాలకు అధికారం లేదా?

నవంబర్ 5న రాష్ట్రంలోని 38 బీసీ కుల సంఘాల ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి రూ. 88.50 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు ప్రకటించడం గమనార్హం. ఏడాదిలోగా నిర్మాణాలు పూర్తి చేయాలనే లక్ష్యాన్ని కూడా ప్రభుత్వం నిర్దేశించినట్లు సమాచారం. నిధుల కేటాయింపు, నిర్మాణాల పర్యవేక్షణ ప్రభుత్వ బాధ్యత అయినప్పటికీ, భవనాల నిర్వహణలో సంఘాల భాగస్వామ్యాన్ని తగ్గించాల్సిన అవసరం ఏమిటని బీసీ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ప్రభుత్వాలు మారవచ్చు.. పాలకులు మారవచ్చు.. కానీ బీసీ సంఘాల ఆత్మగౌరవ భవనాలు మాత్రం ఆయా వర్గాల సామాజిక అభివృద్ధికి శాశ్వత వేదికలుగా ఉండాలన్నది వారి అభిప్రాయం. గత ప్రభుత్వం భూములు కేటాయిస్తే, ప్రస్తుత ప్రభుత్వం నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తోంది. భవిష్యత్తులో మరో ప్రభుత్వం వచ్చినా ఈ భవనాల నిర్వహణ హక్కులు, సంఘాల స్వయం ప్రతిపత్తికి భంగం కలగకుండా శాశ్వత విధానం రూపొందించాలని వారు కోరుతున్నారు.

జీవో నం.14లో అసలు అభ్యంతరమేమిటి?

అక్టోబర్ 29న ప్రభుత్వం జారీ చేసిన జీవో నం.14లో ఆత్మగౌరవ భవనాల నిర్వహణకు సంబంధించి రూపొందించిన మార్గదర్శకాలపై బీసీ సంఘాల నాయకులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. నిర్వహణ కమిటీల్లో ప్రభుత్వ ప్రతినిధులకు అధిక ప్రాధాన్యత కల్పించడం, సంబంధిత కుల సంఘానికి పరిమిత ప్రాతినిధ్యం ఇవ్వడం వంటి అంశాలు సంఘాల స్వతంత్ర నిర్ణయాధికారాన్ని ప్రభావితం చేస్తాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఐదుగురు సభ్యుల నిర్వహణ వ్యవస్థలో నలుగురు ప్రభుత్వ ప్రతినిధులు, సంబంధిత కుల సంఘానికి ఒక్క ప్రతినిధి మాత్రమే ఉంటే సంఘాల అభిప్రాయాలకు తగిన ప్రాధాన్యత ఎలా లభిస్తుందన్న ప్రశ్నను బీసీ నాయకులు లేవనెత్తుతున్నారు. ప్రభుత్వ పర్యవేక్షణ ఉండటం వేరు.. నిర్వహణలో ప్రభుత్వ ఆధిపత్యం పెరగడం వేరని వారు అభిప్రాయపడుతున్నారు.

> ఆంక్షలతో ఆత్మగౌరవానికి పరిమితులా?
>
> భవనాల వినియోగంపై రాజకీయ సమావేశాలు, మతపరమైన కార్యక్రమాలకు సంబంధించిన పరిమితులు, ఆస్తుల బదిలీ, తాకట్టు, సబ్‌లీజు వంటి అంశాల్లో నిషేధాలు కూడా చర్చకు వస్తున్నాయి. భవనాల ఆస్తులను కాపాడేందుకు నిబంధనలు అవసరమే అయినప్పటికీ, వాటి వినియోగంలో సంబంధిత సంఘాలకు తగిన నిర్ణయాధికారం ఉండాలని బీసీ నాయకులు కోరుతున్నారు. నిబంధనల ఉల్లంఘన జరిగితే ముందస్తు నోటీసు లేకుండా నిర్వహణ కమిటీని రద్దు చేసే అవకాశం ఉండటంపైనా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.



జీవో రద్దు చేయకపోతే ఉద్యమం

రాష్ట్ర ప్రభుత్వం జీవో నం.14ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిర్ణయం బీసీలను అణచివేసే ప్రయత్నంగా భావిస్తున్నామని, బీసీ సంఘాల స్వతంత్రతను దెబ్బతీసే విధానాలను ప్రభుత్వం మానుకోవాలని అన్నారు. జీవో రద్దు చేసే వరకు పెద్ద ఎత్తున ఉద్యమ కార్యక్రమాలు చేపడతామని, బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

- గుమ్ముల శ్రీనివాస్, జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు,





ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం బీసీ కులాల అభివృద్ధికి ఆటంకం కలిగించే విధంగా ఉందని పేర్కొన్నారు. ఒకవైపు బీసీల అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెబుతూ, మరోవైపు వారి ఆత్మగౌరవ భవనాల నిర్వహణపై ఆంక్షలు విధించడం సరికాదన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో బీసీ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

- సదానందం, తెలంగాణ బీసీ కులాల ఐక్య వేదిక మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు